# ప్రభువాణి

నివేదకులు :

## బి. హెచ్. నాడగౌడ్, ఎం.ఎ.

ఆంధ్రానువాదం :

**చుండి వెంకట శేషగిరిరావు**

ప్రకాశకులు :

**శ్రీ అచ్యుతాశ్రమము, విరూపాపురగడ్డ**

ఋష్యమూకం, హంపి దగ్గర

## ఓం శ్రీ ఆదిదేవాయ అచ్యుతాయ నమః

# ఆశీర్వచనము

ఓం శాంతిః ॥

మీనుండి వెలువడిన “ప్రభువాణి” అను ఈ చిన్నపుస్తకము నాకెంతో ఆనందము కలిగించింది. నా దేవుడయిన ప్రభుశ్రీ యోగి అచ్యుతులు అప్పుడప్పుడు శిష్యసంపత్తుతో మాటలాడినటు వంటి, వారిదేయైన వైశిష్ట్యమును పొందియున్న ఆ కొన్ని ఉపదేశ వచనములు ఎన్నుకొని, ఈ విధముగా చిక్కినంత, అయినంత సంఖ్యలో యిచ్చిఉండడం ఆశ్రమ బంధువులకు, దాని వలన మానవత్వమునకు చేసిన సేవ, ఆ సేవ అచ్యుతార్పణము అగుటకు మీ వలన చాలా సహకారమయినదని తలంచుచున్నాను.

నా దేవుని సువచనములు గురించి క్రొత్తగా నేనేమి చెప్పేది? అటువంటి అనేక సువచనముల వలనను, అలాగే వారి తత్వానుభవము యొక్క అవిర్భావమునందే ముందు సాగవలసియున్న నేను చెప్పి ముగించజాలను. మన్నించుగాక!

ఆయన సువచనములను ఎలా ఇచ్చారో అలాగే వాటికి కావలసిన కొన్ని విస్తృత వాక్యములను కూడా ఆయనే ఇచ్చారు. పొరపాటను తప్పిపోయి ఉంటే, దానికి మన అస్థిరత మరియు పరిమిత విజ్ఞానము మాత్రమే కారణమై ఉంటుంది.

ఇంత చిన్న పుస్తకములో, అందులోనూ ఆ సువచనము లలో, దొరికే కొన్ని అంశముల తత్వసంపదనే వివరించి యుండుట నిజముగా శ్లాఘనీయము. దీని వలన దయాఘనుడయిన నా గురువు యొక్క తత్వ ప్రణాళికను గురించి తగినంతవరకైన జనము తెలుసు కొనుగాక. సమాజపు సామాన్య మాటలు ద్వారానే గొప్ప తత్వమును ఈ “ప్రభువాణి” సమర్పించుచున్నది. ఇక్కడ సంగ్రహింపబడిన మాటలలోనే ఆయన ఉపదేశపు కాంతి ఉన్నది. వివరణమునందు కూడా ఆయన వైఖరి ఉన్నది. భాష నవకన్నడ గద్యశైలిలో వాక్యరచనము సరళరీతిలో సిద్ధించినదని భావిస్తున్నాను.

ఇలాగే ఇకముందు కూడా సాహసించి సేవచేయండి. నా దేవుడు దయచూపుగాక అని ప్రార్థించుచున్నాను. శ్రీ అచ్యుతానుగ్రహ ప్రాప్తిరస్తు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇట్లు మీ ప్రేమి

విజయీంద్ర

**(బ్రహ్మశ్రీ స్వామి విజయీంద్ర)**

**శ్రీ అచ్యుతాశ్రమపు వక్తలు**

గదర్

4-5-1977

# దీవెన

శ్రీ నాడగౌడ్‌గారు మా ఆశ్రమపు దేవుడైన శ్రీ యోగి అచ్యుతుల "ప్రభువాణి" అను ఈ చిన్న పుస్తకమును సమాజమునకు ఇవ్వడము చాలా స్తుత్యర్హము. ఆశ్రమములో మా దేవుడు అప్పుడప్పుడు ఆనందమునుండి వివేకము వరకుగల జీవితపు క్రమములో సాగివచ్చిన మా అందరి పరివర్తనల గురించి, ముందు కావవలసిన ప్రగతి గురించి, మాటలాడుతూ వచ్చిన, ఉపదేశిస్తూ వచ్చిన, మార్మికమైన, అతిఘనమైన ఈ మహావాక్యములను వ్రాసిపెట్టుకొని యున్నందున, ఎన్నుకొని, పొంది దానికి అయినంత ప్రభుకృపా వివేచనాసహితములగు వాక్యములనే ప్రసాదముగా పొంది ఈ రీతి "ప్రభువాణి" గా బయలు పరిచినారు. ఇది నిజముగా స్మరణీయమై నటువంటిది. దీనిపట్ల ఆశ్రమపు అధికారవర్గము, తాత్వికవర్గము, సమస్తమూ మనసారా ఈ మూలకముగ దీవించుచున్నది. ఇంతటి సుమధుర, అత్యావశ్యక సేవ ద్వారా అచ్యుతుల సేవను అచ్యుతముగా జరుపుచూ, ఆయన దయను లోకానికి ప్రసారము చేయుటలో చాలా ఉపయుక్తమై శ్రీ నాడగౌడ్ గారి జీవితము సాగివచ్చుగాక ! అన్నదే నేను అచ్యుతులకు సమర్పించు ప్రార్థన. అచ్యుతానుగ్రహ ప్రాప్తిరస్తు.

స్వామి సీతారామ

శ్రీ అచ్యుతాశ్రమపు ప్రప్రధాన గరువులు

# సందేశము

ఆశ్రమ బంధువులెల్లరి ద్వారా నియుక్తుడైన నన్ను అధ్యక్ష స్థానమునుండి వ్రాయవలసినదని శ్రీ నాడగౌడ్‌గారు నిర్దేశించినారు. నేను ఈ విధమైన ఏ ప్రజ్ఞకూ అంటుకొని బ్రతుకని మనుష్యుడనై నప్పటికి నా ఆశ అంతటి ప్రాజ్ఞసమాజపు నీడను వదలి నన్ను బయటకి నెట్టనంతటి అనుగ్రహము మా దేవుడైన శ్రీ అచ్యుతుల దయవలన ఇంతవరకూ భక్తి నివేదనము ద్వారా నన్ను నడపు కుంటూ వచ్చినది. అచ్యుతలు అనేక గొప్ప గుణములకు పిచ్చెక్కిన నేను కూడా కేవలం ఒక నివేదనా భక్తితో సాగివచ్చితి. శ్రీ నాడగౌడ్ గారు శ్రద్ధావంతులు, సాధకులు అయిఉండి మా ఆశ్రమపు యావత్తు సాహిత్య సంపత్తును ఎలాగో ప్రభుకృపద్వారా సంపాదించుకుని, సాధ్యమైనంతవరకు ప్రకటించుచూ వస్తున్నారు. ఇది చాలా సంతోషకరమైన విషయము. ఆశ్రమపు సాహిత్యమంటే నిజానికి ఆదివైదిక సాహిత్యపు పరమోచ్ఛతమ ప్రకటనమనియే చెప్పవలయును. తత్సాహిత్య సంపదకు జీవమును, కృపను, కాంతిని యిచ్చుకుంటూ సాగించుకుంటూ వచ్చినారు మా ప్రభువులగు శ్రీ అచ్యుతులు. అటువంటివారు అప్పుడప్పుడు లీలాజాలముగా మాట్లాడి ప్రసాదించిన మానవహితకారులగు ఈ మహావాక్యములను దొరికినచోటులెల్ల సంగ్రహించి ఈ "ప్రభువాణి"అను రూపంలో శ్రీ నాడగౌడ్‌గారు ఇచ్చి, మన ఆశ్రమపు సాహిత్య విభాగము యొక్క కార్యరంగమునకు చాలా సహాయపడినారు. ఇక్కడ ప్రమాణముకంటె కూడా ప్రసాద పరిణామములు చాలా గమనార్హములని మరొకసారి చెప్పగోరుచున్నాను. వీరి వివేచనము మరియు వివరణము తాత్విక, వాస్తవిక, సత్యమునకు ఉత్కృష్టమైన సంయోజనము పొందియున్నవి. ఈ సేవ వీరినుండి అచ్యుతానుగ్రహితమై అచ్యుతముగా సాగిరావలెనని కోరుతూ విరమించెదను.

కె.యల్. నారాయణరావు

# తెలుగుముద్రణ

1977వ సంవత్సరములో కన్నడభాషలో ప్రచురింపబడిన "ప్రభువాణి"ని ఇప్పుడు తెలుగుభాషలో ప్రచురించుటకు మేము చాలా సంతోషిస్తున్నాము. ఆంధ్రానువాదం ఎంతో అమోఘముగా, సమర్థవంతంగా నిర్వహించిన శ్రీ. సి.వి. శేషగిరిరావు గారికి మా కృతజ్ఞతలు, వారికి మా దైవమైన శ్రీ యోగి అచ్యుతులవారి అనుగ్రహము కలుగవలెనని ప్రార్థించుచున్నాము.

ఇట్లు

సేవకుడు

బి.హెచ్. నాడగౌడ్

# నివేదనము

ప్రభుశ్రీ యోగి అచ్యుతులు తమ శిష్య సంపత్తులో సందర్భ మునకు తగినట్లుగా ప్రవచించిన కొన్ని సువచనములు చూచుటకు సామాన్యమనిపించినను అవి మార్మికములు, తాత్త్వికములుగా ఉన్నా యనునది ఈ పుస్తకమును చదివే మీ అందరి మనసులకు తోచగలదు. శ్రీ కృష్ణుడు తత్వమును కేవలము అర్జుననకు మాత్రమే చెప్పకుండా, సంపూర్ణ మానవజాతికే చెప్పినట్లుగా, ప్రభువులు సకల జీవుల కళ్యాణము కొరకు శ్రమపడు యోగులైన కారణముచే, వారి ప్రతి యొక్క హావము, భావము, సువచనము సంపూర్ణమానవత యొక్క ఉత్కర్ష కోసమే అయి ఉన్నది. ఇలా లభించిన కొన్ని సువచములను తాత్వికముగా వివేచించుచు, సాధన యొక్క వ్యవస్థను వివరించుము అని ప్రభువుల ఆజ్ఞాఫలితముగా వెలువడిన ఈ గ్రంథమును ఆసక్తితో చదువు మీకు ప్రీతితో నివేదించుకొను చున్నాను.

ఎల్ల మానవులకు సాధనబద్ధమైన జీవనమును సాగించనిదే గత్యంతరము లేదు. జీవితమనగా యింద్రియముల చాపల్య మునకంటుకొని ఊగిసలాడు బ్రతుకు కాక భవ్యతను కనుగొను మహాయజ్ఞము. దీనినీ మీ మనస్సులో కలుగజేసి ఆ వైపుకు శ్రమించుటలో కావలసిన ప్రేరణను ఈపుస్తకము ఇవ్వగలిగినట్లయితే, అక్కడికి నా శ్రమ సార్థకమయినట్లే.

ప్రభువులను తత్వప్రణాళికను తెలుసుకొంటిమని అనుకుంటే అది ఒక మహా అభాసము. దాన్ని తెలుసుకొనుటలో తపస్సను మహాసూత్రమును ప్రభువులే కరుణించి అందులో ముందుకు సాగి సమస్తమును తెలుసుకొనుడని చెప్పినప్పటికి, ఆ మహామహుని కృపలేనిదే తెలుసుకొనుట కష్టమని మా అనుభవము. ఇక్కడ నా విద్యాగురువులైన బ్రహ్మశ్రీ స్వామి విజయీంద్రుల పరిశ్రమపు ఫలమై, తత్వరంగమునందు మొదటి అడుగునిడుచున్న నాలో ఒక విధమైన సంతసము కలిగింది. ప్రభువుల కృపను దత్తం చేయించిన మహాత్ములు వీరు. అదే రీతిగా బ్రహ్మశ్రీ స్వామి జయతీర్థులు నా ఆత్మకు చాలినంత అభ్యాసమునిచ్చి, తత్వచికిత్సను చేసి ఉపకరించినారు. అదే విధంగా బ్రహ్మశ్రీ స్వామి సీతారాంగారు, అధ్యక్షులైన శ్రీ నారాయణరావుగారు, ప్రభుసేవకులైన శ్రీ నేమకల్లురామన్న గారు, మోటారు కంపెనీ యజమానులగు ప్రేమి లక్ష్మనరావుగారు, శ్రీ అంజనేయులుగారు కనుమరుగై పోయిన శ్రీ సింగారు వేలుగారు నా అల్పజీవితమునకు ఘనతయను లేపమును పూసినారు. నన్ను తమవడిలో ఉంచుకొని పెంచినారు. వారికి నేను ఋణపడి వున్నానని చెప్పినంత మాత్రముననే అంతయు చెప్పినట్లు కాదు. అందుచే నేనిక్కడ మూగగా వారందరికి నా నివేదనమును సమర్పించుకొనుచున్నాను. ప్రభువుల కృప ఆ సుజీవలకందరికి లభించుగాక, ఎందుకంటే వారి ద్వారా సంపూర్ణ మానవజాతియే సార్థకతను పొందవలసియున్నది.

హే ! ప్రభు ! నీ కరుణామయ పుత్రుడనై సాధనలో తడబడుచున్న అల్పుడనైన నన్ను జగచ్ఛేవను సంతృప్తికరముగా చేయగల భటునిగా చేయుము. సేవకన్న హెచ్చైనదానిని నేను కోరను. ఆ సేవకు జ్ఞానము, ప్రజ్ఞ, భక్తి, సమర్పణలు కావలసియున్నందున వాటిని కరుణించుము. దుఃఖమునందున్న మానవతను ఉద్ధరించుటకై వచ్చియున్న నిన్ను నేనేవిధముగా ప్రార్థించుకొన గలను ? ప్రార్థనను నేర్పించి చేయించువాడవు నీవె, దానికి స్వీకరించువాడవు నీవే ! ఇలా ఉండే నీ వైచిత్ర్యానికి నన్ను నేనే నీ పాదములకు సమర్పించుకొనుచున్నాను.

ఇట్లు

ఓం శాంతిః శాంతిః శాంతిః

సేవకుడు

**బి.హెచ్. నాడగౌడ్**

# ప్రభువాణి

1. అవ్వ పెంచిన పిల్లలు యెందుకు పనికిరారు.

2. నన్ను ఎవరి గుంపులో నైనా కలుపు, పిల్లల గుంపులో కలపకు.

మనుష్య జీవితము రెండు రకములైన సంపత్తుతో కూడి యున్నది. ప్రకృతి సిద్ధపరచి యిచ్చియున్నట్టి ఆ రెండు విధముల సంపత్తును పరస్పరము సమన్వయపరిచి సదుపయోగపరుచుకొని బ్రతికినపుడే మనుష్య జీవితము సార్థకమైనట్లే. జ్ఞానులు సిద్ధమై, దత్తమైయున్న సంపత్తు యొక్క ఒక రకమును దైహికము లేక ఇంద్రియమనియు, మరియొక రకమును దైవికము లేక నిరీంద్రియమనియు పిలిచారు. ఇతరులు వాటిని బాహ్యము - అంతరికము, భౌతికము - భవ్యము, లౌకికము - అలౌకికము, అథస్సు - ఊర్ధ్వము అపరా - పరా, అవిద్యా - విద్యా, స్థూలము - సూక్ష్మము అని కూడా పిలిచారు.

మనుష్య జీవితము స్థూలమైన దేహమనే యంత్రములో నెల కొనియున్నది. ఈ దేహ యంత్రానికి పది ఇంద్రియములుంటూ అవి తమకుండే స్వాభావిక గతిలో కార్యోన్ముఖమై యున్నవి. ఇంద్రియములలో కూడా రెండు రకములున్నాయి. ఐదు ఇంద్రియముల ఒక సమూహమును బ్రహ్మేంద్రియము లేక జ్ఞానేంద్రియము, లేక బుద్ధీంద్రియమనియు మరియొక ఐదు ఇంద్రియముల సమూహమునకు కర్మేంద్రియమనియు పేర్లు ఉన్నవి. బ్రహ్మేంద్రియములనగా చెవి, కన్ను, చర్మము, నాలుక మరియు ముక్కు, కర్మేంద్రియములనగా గుదము, జననేంద్రియము, చెయ్యి, కాలు మరియు నోరు. ఈ పది ఇంద్రియముల సమూహమునకు ఐంద్రియ సంపత్తు అని పిలువ బడును.

దేహయంత్రము లోపల దశేంద్రియముల సమూహమును నిర్దేశించుచూ ఉన్న అతీంద్రియ సంపత్తు అని పిలువబడు నిరీంద్రియ చేతనల సమూహము ఉన్నది. వాటిలో మొదటిది మన - ఇంద్రియము అని పిలువబడినది. అంటే! ఇంద్రియముల సంపర్కము నందుంటూ, వాటిని ఆడించుచు తాను కూడా ఆడుచు సుఖ, దు:ఖములు, ఓటమి - గెలుపులు, నిద్ర - మెలకువలు మొదలయినవి ద్వంద్వములలో చిక్కుకొనియుండునట్టి మనస్సే మన-ఇంద్రియము.

మన - ఇంద్రియమును మించిన ఇతర చేతనలను ఈ క్రింది విధముగా నిర్దేశించుకొనవచ్చును. మనస్సు, అహంకారము, చిత్తము, బుద్ధి, ఆత్మ, ఈ సమస్త నిరీంద్రియ చేతనా సమూహమునకు, దశేంద్రియములకున్ను ఆధారభూతమైన శక్తియొకటి ఉన్నది. దానిని ప్రాణము అని పిలచినారు. ప్రాణమునకు ఆధారమైనది వాయువు. ఆ కారణముచే ప్రాణమును ప్రాణవాయువనియు పిలిచినారు.

మనకుండే ఈ రెండు సంపత్తులు, ఇంద్రియ మరియు నిరీంద్రియ సంపత్తులు మనకు దైవదత్తమై వచ్చినవైనప్పటికి అవిమాననీయ సంపత్తులని మా ఆశ్రమపు వక్తలగు బ్రహ్మశ్రీ విజయాంధ్ర స్వాములు వివరించుచున్నారు. ఇవ్వబడిన సంపత్తును, వాటికియున్న పొందికను తెలుసుకొని సమర్పక రీతిలో ఉపయోగించుకొని ధన్యులము కావలయునని వారు వత్తిపలుకుచున్నారు.

ప్రభుశ్రీ యోగి అచ్యుతులు సాంకేతికముగా దశేంద్రియములను పిల్లలతో పోల్చుచున్నారు. పిల్లలకున్నట్లే ఇంద్రియములకు కూడా చాపల్యము హెచ్చు. జతగా చాంచల్యము, హఠము, అవివేకము, అల్ప తృప్తి, తీవ్రమైన అలసట,

నిద్రాప్రియత, అకుశలత్వము మొదలైన గుణములు రెండు వర్గములకున్నూ సమానమైయున్నవి. దశేంద్రియములను నియంత్రించుచు ఉండే శక్తియైన మన - ఇంద్రియము, ముప్పుచే కృశించిన ముదుసలిలాగా ఉంటూ నిస్త్రాణమైన, అది పీడించుచూ ఉన్న ఇంద్రియ సముదాయమును స్వాధీనములో పెట్టుకొనుటకు అసమర్థమైనపుడు అంతటా ఆరాజకత ఏర్పడి సంక్షోభము బయలు దేరుతుంది. ఇంద్రియ రాజ్యమును సర్వత్రగెలుచుకొని ఆత్మ సామ్రాజ్యపు స్వరాజ్యమందు ఏకమేవా ద్వితీయులై ఉంటూ సర్వదా శాంతియొక్క పరమస్థానమందు నివసించు ప్రభువులు, మరల తమను ఇంద్రియముల గుంపులోపల వేయ వద్దని నవ్వులాటగా మాటలాడుచున్నారు.

ఇంద్రియములు ఇచ్చు సుఖము కేవలము క్షణికమైనది, కానీ, నిరింద్రియ సుఖము శాశ్వతముగా ఉండగలదు. ఉపనిషత్తు, క్షణికమైన ఇంద్రియ సుఖమును ప్రేయస్సు అని, శాశ్వతమైన నిరింద్రియ సుఖమును శ్రేయస్సు అని పిలిచినది. మన - ఇంద్రియపు సహవాసమందుండు మానవులమైన మనము అందరము నిరుపయోగ వ్యక్తులము, ఎందుకంటే కేవలము చనిపోవుట కొరకే బ్రతికియుండే మనవలన ఇంకేమి కాగలదు? మనుష్య జీవనమును భరించుచున్న మనము బ్రతికి యుండునది జీవించుటకో లేక చనిపోవుటకో? దీనిని మానవులందరు తీవ్రముగా ఆలోచించుకొనవలయుననునది ప్రభువుల తత్వసారము.

పురాణమునందు కశ్యపబ్రహ్మ వలన అయన 13 భార్యల ద్వారా సకల జీవ - జడరాశుల సృష్టి అయినది, అను అర్థముగల సాంకేతిక కథ ఒకటి గలదు కశ్యపుడు దితి వలన దైత్యులను, అధితి ద్వారా దేవతలను సంతానముగ పొందెనని ఉన్నది. మిగిలిన భార్యల ద్వారా మిగిలిన సమస్త జీవ జడరాశులు వెలువడినవి. దీని అర్థమేమిటి?

దశేంద్రియముల సమూహము, వాటి విషయములు ఇత్యాది దుష్టశక్తులను దైత్యులనియూ, నిరింద్రియ శక్తులను దేవతలనియును అర్థము చేసుకోవలసియున్నది. ఈ విధమైన సృష్టి సర్వకాలములందు సర్వత్రా జరుగుచూ వచ్చినది. అది యికముందు కూడా జరుగుతుంది. ఎందుకంటే దితి అనునది భౌతిక తత్త్వము. దానిని అధారముగా చేసికొని దేహనిర్మాణమయినందున, దానికి దశేంద్రియముల సొగసు ఉన్నది. దేహయంత్రము లోపల నిరింద్రియ శక్తులున్నవి, వ్యవస్థితమైన ఈ రెండు మనకున్న మానవీయ సంపత్తులైనందున, వాటి వ్యవస్థ ప్రతియొక్క మనుష్యునిలోను ఉన్నది. దీనిని తెలునుకొనుటకు యోగసాధన ఏకైక మార్గమైనందున మనుష్యులు ఆ మార్గమునే శరణు పొందవలయును.

## 3. మాట ఇంటికి చేటు

దశేంద్రియములందు ఒకటైన మాటను కర్మేంద్రియమని పిలిచెదరు. దీనిని వాగింద్రియము అనియు పిలిచినారు. వాగింద్రియమునుండి మాటవచ్చును. కావున ఎక్కువగ మాట్లాడుటవలన ఇంద్రియము కృశించి నశించును. మాట్లాడునప్పుడు శ్వాసనష్టమై, శ్వాసనష్టమువలన ప్రాణనష్టం, ప్రాణనష్టము వలన మనోనష్టము వలన జీవ-జీవన నష్టము అగుచున్నందున, మాట వలన ఇల్లు అను దేహబద్ధము అగు జీవనము పాడు అగును.

మాటకు ఒక పై స్థానము (ఊర్ధ్వ) ఉన్నది. అదే వాణి, ఈ రెంటికి మూలము శబ్దము. శబ్దమునకు మూలము ప్రాణశక్తి అంటే ఆత్మను లోగొనిన ప్రాణశక్తి. వేదమును శబ్దము అని అను భవజ్ఞులు చెప్పినారు. అంటే వేదమునకు

మూలశక్తి అనగా ప్రాణశక్తి అనినట్లయినది. యోగసాధనము వలన ప్రాణమయిన జీవుడు ఆత్మతో సంయోగము పొందినప్పుడు జ్ఞానము వేద్యముకాగా, వేద్యమయిన జ్ఞానరాశిని వేదము అని పిలిచిరి. వేదమును శృతి అని పిలుచుటలో అర్థమిదే. వేదపు మూలము శబ్దమయినందున ఆ శబ్దపు స్పందనను మనోభూమియందు ఆలించునపుడు శబ్దము ఎలారూపము దాల్చి తత్వబద్ధమై వెలువడుననునది తెలుసుకొనవచ్చును. దీనిని మహర్షులు యోగపు ఉన్నత స్థితిలో సాధించుకొని ఉండెడివారు. ఈ తత్వమును బ్రహ్మశ్రీ విజయాంద్రస్వాములవారి ఒక వచనము అందముగా వివరించుచున్నది.

"మాటే ఒక ముత్యమైతే, ఆ మాట అనునది
ఆత్మతో పుట్టి, విశ్వాత్మతో కలిసి, ఉపకరించి
పరమాత్మ అడుగులందు పుష్పమయినపుడే
అది మాట అగునన్నా!" (---విశ్వవాణి)

## 4. అల్పుల సంగము అభిమాన భంగము

పైన వివరించిన దశేంద్రియములకూ, పదకొండవదయిన మన- ఇంద్రియమునకు ఊర్ధ్వగతి మరియు అధోగతి అను రెండుగతులు ఉన్నవి ఈ ఇంద్రియమునకు ఊర్ధ్వగతి యొక్క ఊర్జిత స్థితిలో సాగినప్పుడు అవి సంపత్తు అవుతాయి. అయితే అధోగతి యొక్క దుస్థితిలో ఉండినప్పుడు విపత్తు అయి పీడించుతాయి. సంపత్తు సుఖానికి, విపత్తు దుఃఖానికి కారణమైయున్న ఈ ఇంద్రియముల విషయములో యేమరరాదు. అవి అల్పతలో ఉండిపోయినప్పుడు మనుష్య జీవనము అస్తవ్యస్తమై దురంతమునకు కారణ మగును. ఇంద్రియ దర్పముతో జీవించు దురహంకారికి భంగము తప్పదు.

## 5. మానవ మనస్సునునది డౌనులో పరుగెత్తుతున్న బ్రేకులు లేని సైకిలే కదా!

కేవలం ఇంద్రియ జీవనము పతనము వంటిది. ఒకసారి కాలుజారిందంటే పాతాళము చేరెదము. ఇట్లవడానికి మన-ఇంద్రియమే కారణము. సదా మోసపోవు మన-ఇంద్రియమునకు బుద్ధి యొక్క బ్రేకు అవసరము, ఇంద్రియముల ప్రచోదనకు మోహపడే మన-ఇంద్రియము వివేకరహితమై ఇంద్రియములతో ఆడుచూ సంతోషపడుచున్నప్పుడు దాని శక్తి అధోముఖముగా ప్రవహించుట వలన తగ్గిపోతుంది. ఎల్లప్పుడు అధోముఖముగా ప్రవహించి నష్టపోవు మనస్సును ఊర్ధ్వముఖముగా చేయుటకు యోగసాధన కావలయును. ఉపనిషత్తు మాటలలో చెప్పాలంటే, ఎలా తాబేలు తన అవయవములను లోపలికి లాగుకొని ఒకటే ముద్ద అయి ఉండగలదో అదే రీతి సాధకుడు తన యోగసాధనలో, అధోముఖముగా ప్రవహించు ఇంద్రియ శక్తిని లోపలికి లాగుకొని క్రోడీకరించుకున్న అన్ని శక్తులను బ్రహ్మేంద్రియముల సమూహస్థానమగు బ్రహ్మరంధ్రమునందు సంయోగపరచినప్పుడు అది యోగమనిపించుకుంటుంది. అక్కడ నిరీంద్రియపు శాశ్వత సుఖము దొరకగలదు. అట్లయినప్పుడు మనలో మనుష్యత్వము, పురుషత్వము మేలుకొన్నట్లే! ఆస్థితిని "మనలను మనము తెలుసుకునే రీతి'' అని ప్రాచీనులు వర్ణించినారు.

మనలను పతనమునకు తీసుకొనిపోయే మనస్సు, ప్రయత్నముతో యోగమార్గములో సాగినచో ఆత్మ దర్శనమును చేయించగలదు. శ్రీకృష్ణుడు గీతలోను, అట్లే మహర్షులు ఉపనిషత్‌లలోను, మనస్సును విచిత్ర శక్తి శతృవు కాగలదు - మిత్రము కాగలదు అని వర్ణించారు. మనస్సు నిజముగా శ్రేష్ఠ శక్తి. అది తెలియక మనము ఘొల్లు మంటున్నాము.

# 6.కూర్చొనుడు, చేయుడు, చూడుడు

స్థిరమైన ఆసనమందు సమచిత్తుడై కూర్చొని శరీరము, మనస్సులను కదిలించక యోగసాధనయందు ప్రయత్నము చేసినపుడు ఉన్నతి శీఘ్రముగా దొరకగలదు. మానవ జీవితపు గురి "మనలను మనము తెలిసికొనుట'' అని అందరు చెప్పుదురు. కానీ దానిని తెలుసుకొను పద్ధతి ఏమి? కేవలము నోటిమాటతో స్వర్గము కనుగొనగలమా?

ఇక్కడ తెలుసుకొనుట అంటే ప్రత్యక్షానుభవమును పొందుట అని అర్థము, మనయందు దైవదత్తముగా వచ్చియున్న మానవీయ సంపదయొక్క ఏర్పాటును అనుభవమూలకముగ తెలుసుకొను విధానమునకు యోగసాధన అని పేరు. దీనిని మొదటి నుండి ఆధ్యాత్మ విద్యయనియు అది ప్రత్యక్షముగా గురువులేనిచో లభ్యము కాజాలదనియు అందరు అనుభవజ్ఞులు చెప్పుచునే వచ్చారు. అనుభవజ్ఞులగు గురువులనుండి ఈ రహస్యము తెలిసికొనుటకు ప్రయత్నించకనే కేవలము పుస్తకము చదివి తెలిసికొంటమనునది అది ఎంతటి ఆభాసమో!

తత్వజ్ఞానమును దర్శనమనుట భారతీయ పరంపరలో ప్రసిద్ది చెందియున్నది. ఇక్కడ తత్వజ్ఞానమును దర్శించవలెనని సూచింపబడింది. దర్శనమంటే ప్రత్యక్షముగా చూచుట. చూచిన దానిని అనుభవమునకు తెచ్చుకొని తెలుసుకొనుట, చెప్పిన మాటలతో తత్వము తెలుసుకొనుట కుదరదు. నా అజ్ఞానమును నివారించవలెనంటే నేను జ్ఞానమును పొందవలయునే కాని మరియొకరి జ్ఞానము వలన నాకు అయ్యే ఉపయోగమేమీ లేదు.

# 7. ఉత్తమ మానవ జన్మము తుచ్ఛ భోగము కొరకుకాదు

# 8. అకాల కార్యము సోమరితనము - వీటికి చోటివ్వకుడు

మన-ఇంద్రియమునకు కామ్యాది పాశములు బలీయమైయున్నప్పుడు అది (మన-ఇంద్రియము) దశేంద్రియములను కామించి, భోగించి, తాత్కాలికమైన మత్తుచే మోహమును పొంది జీవితమంటే ఆ భోగమే అన్నంతమేరకు ఈ భ్రాంతిలో చిక్కుకొని యుంటుంది. అయితే క్షణకాలము మైమరపించే ఈ భోగభాగ్యము అల్పము, ("నాల్పే సుఖమస్తి") క్షుద్రమూ ("క్షుద్ర హృదయ దౌర్బల్యం") అయి ఉంటూ, చివరకు మనలను నిశ్శక్తులనుగా చేయును. ఉదా:కన్ను చూడ్డానికి ఆశపడుతుంది కానీ చూసి చూసి అలసిపోయి విసుగెత్తి యికచాలు అనుకొని కన్నుమూస్తుంది. జిహ్వాచాపల్యమునకు లోనయి తింటూపోతే అసహ్యము (ఏవగింపు) అవుతుంది. కామేచ్ఛ కూడా అంతే. అతియైనప్పుడు విపరీత పరిణామమేర్పడుతుంది.

అయితే నిరీంద్రియ శక్తుల సహవాసపు సుఖమే వేరు. అక్కడ నిరాశ, ఓటమి, నిస్సత్తువ అనేదే లేదు. ఇలా ఎందుకంటే అవి మనకు ఇవ్వజాలిన సంపత్తుకు మేరయనునదే లేదు. ఈ మాటను పూర్వకాలపు భక్తులు కామధేనువు, కల్పవృక్షము, అక్షయపాత్ర మొదలగు సంకేతములతో చెప్పినారు. భౌతిక సంపద వాడినకొద్దీ కరిగిపోతూ ఉండగా, అంతరిక సంపద వాడినకొద్దీ పెరుగుతూపోతుంది. అది అపారమగు సంపద. ఆ సంపదను దైవము మన కోసం దయచేసినది. అది ఇక్కడే, అంటే మనలోనే ఉంచబడినది, పొందుటయే మన కర్తవ్యము. ఇవ్వడానికి అది సిద్ధముగా ఉన్నది.

ప్రభువులు ఒకసారి ఇలా చెప్పినారు : "అబ్బాయిలూ! నేను కావలసినంత సంపాదించిపెట్టియున్నాను. నాదంతయు మీ కోసమే ఉన్నది. దానిని మీరు పొందితే చాలు. అయితే దానిని పొంద గలిగే యోగ్యతను సంపాదించుకొనండి''.

యోగము వలన యోగ్యత వస్తుంది. అయితే యోగజీవనమునకు రెండు చాలా పెద్ద ఆటంకములున్నందున,

వాటినుండి మనలను మనము ఉద్ధరించుకొనవలసియున్నది. ఆ రెండు ఆటంకము లేవియనగా అకాల కార్యము అనగా తగని సమయములో పని చేయుట మరియు సోమరితనమూ అనగా తగిన సమయములో పని చేయకుండుట.

## 9. నేను సత్యసంపద కోసమే పుట్టినది అనే దృఢ సంకల్పము ఉండనీ

నిరింద్రియ సంపదను ప్రభువులు సత్యసంపద అని పిలిచినారు. ఏ సంపద నిత్యము, నూతనము, శాశ్వతము అయిఉంటుందో అదే సత్యసంపద, అంటే సత్యము యొక్క సంపద (లేదా) సత్యము కొరకు సంపద, మనము ఆ సత్యసంపదకు నేరుగా వారసులము, దానిని పొందినప్పుడు జీవితానికి ఊర్ధ్వగతి దొరికినట్లే. దీనికి దృఢత్వము కావాలి.

శ్రీకృష్ణుడు గీతలో (16-1, 2,3) ప్రభుశ్రీ అచ్యుతులు దేనిని సత్యసంపత్తు అని అన్నారో, దానిని దైవీసంపత్తు అని పిలిచినాడు. యోగమును అలవరుచుకున్న ఏ సాధకుడు సాధనలో సాగుతూపోవునోఅటువంటివానికి దైవీసంపత్తు దత్తమగుననియు, దానిని దత్తముగా చేసికొనినవానిలో ఈ క్రింది గుణములు స్వాభావికముగా ప్రకాశించుననియు చెప్పినాడు. యోగసాధనవలన అతని సత్వము శుద్ధమై, తపస్సు యొక్క తీవ్రతవలన తేజస్సు, జ్ఞానము చివరకు పరమశాంతియున్ను లభించును. అటువంటి పురుషుడు భయము, చాపల్యము, లోలత్వము, అశౌచము, ద్రోహము, అభిమానము, క్రోధములేనివాడుగను, మృదుస్వభావియు, సిగ్గుపడు స్వభావము కలవాడును, భూతదయను పొందినవాడుగను అయి ఉంటాడు.

సత్యమైన ఈ దైవీసంపద మోక్షము కొరకు యున్నది అని చెప్పుచూ ఎవరు కేవలము ఆసురీ సంపదయగు ఇంద్రియ, భోగములో బ్రతుకుదురో వారు సంసారపు దుఃఖమునందు బద్దులగుదురని ఖచ్చితముగ శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

## 10. స్వావలంబిగా బ్రతుకండి. పరాశ్రయము వద్దు

మనుష్య జీవితము నాలుగు ఆధార స్తంభములమీద నిలబడియున్నది. అవి ఏవనగా; మొదటిది దేహమనే గూడును కట్టుకొని వాయువును ఆధారముగ నుంచుకొని దేహమును ఆడించుచూఉండే ప్రాణము; రెండవది ఇచ్ఛాశక్తి యనిపించుకుంటూ సంకల్ప, వికల్పముల ద్వంద్వములో చిక్కుకొన్న మనస్సు; మూడవది మనస్సు యొక్క ఊర్ధ్వగతి యనిపించుకుంటూ, దైవత్వపు ప్రతినిధియై వెలుగుచున్న ఆత్మ ; నాలుగవది గుప్తముగా ఆడించుచున్న మాయయని పిలిపించుకొనుచున్న దైవము. "దైవీహ్యేషాగుణమయీమమ మాయా దురత్యయా" అను గీతయొక్క మాటలో ఈఅంశము వ్యక్తమైనది.

ఈ నాలుగు శక్తులే మనకు ఆలంబనము లేదా అవలంబనములు. సాధనలో ఈశక్తులను తెలుసుకున్నవారిలో కొంతమంది తమకు ప్రియమైన ఒక శక్తికి ఎక్కువ లక్ష్యమిచ్చి దానిని గురించి విశేషముగా అతిరంజిత విశేషణములను వాడి వర్ణించునపుడు మిగిలిన శక్తులు అప్రధానములై కనబడినవి. తత్వము యొక్క సమగ్ర దృష్టి లేనప్పుడు ఇంతటి తాత్విక అనాహుతములు యేర్పడి సంపూర్ణ తత్వరంగము అనర్థకారకమగు వాదవివాదముల రణరంగమగుచున్నది.

మనుష్య జీవనములో వ్యత్యస్తమై ఆంతరిక శక్తులను తెలుసుకొనుటకు ప్రయత్నించకనే, తుచ్ఛశక్తులను జీవనాధార స్తంభములని భావించి మోసపోయే జనులే ఎక్కువైయున్న ఈ కాలములో యోగము, సాధన, తపస్సు అను మాటలకు విలువేలేకుండా పోయినది. వైజ్ఞానికమని పిలిపించుకొనిన ఈ యుగములోనున్న ప్రాయోగిక మనోధర్మము ఏ మాత్రము

ఉన్నది. మన దేహమును మనము ఇంకను తెలిసి కొనవలేదు. తెలిసికొనుటకు ఉండే ఏకైక మార్గమైన యోగసాధనను కూడా తెలిసికోకుండా చిత్రవిచిత్రము మనము అంగ-వంగ విహంగమము అగు మార్గములలో మోసపోతిమి.

బ్రహ్మశ్రీ విజయీంద్రస్వాముల వచనమొకటి ఇలా చెబుతుంది :

"అంధ సంప్రదాయములలో అలసిపోవుచున్న ఈ జనులకు భవబంధమోచనము ఎప్పుడు కలుగునో"(విశ్వవాణి)

మనుష్య జీవనము పైన వివరించిన నాలుగు ఆలంబనములను ఆధారముగా జేసికొని రూపము దాల్చినది. ఇవియన్నియు దైవీ సంపత్తుయని పిలువబడిన నిరీంద్రియ శక్తులు, అయినప్పటికి అవి దేహయంత్రములో చిక్కుకొనియున్న కారణముచే వాటికి కూడ కొన్ని హద్దులున్నవి. ఈ హద్దులను దాటుటకు సాధ్యమయినప్పటికీ అది చాలా కఠినమనియే చెప్పవలయును.

మొదటిదయిన ప్రాణశక్తికి అశనమనే అన్నము కావలసినది. యోగసాధనలో ప్రాణమును వాయువు యొక్క మథనమునందుంచి ధైర్యముగా మధించునప్పుడు అక్కడ అనగా ఆ మథనములో మజ్జిగ చిలికినప్పుడు ఎలా వెన్నతేలుతూ వస్తుందో అదేవిధముగా అశన మనే అన్నము తేలుతూరాగా దానిని ప్రాణము భుజించును.

ఈశావాస్యోపనిషత్ యొక్క మొదటి మంత్రము.
" ఈశావాశ్య మిదం సర్వం, యత్కించ జగత్యాం జగత్ ॥
తేనత్యక్తేన భుంజీథా మాగృధ : కస్యస్విద్ధనమ్"

ఈ విధముగా అశనము యొక్క ప్రాముఖ్యతను ఘోషించుచున్నది.

ప్రాణమును ప్రభువులు "అశనగత : ప్రాణః" అని పిలిచినారు. అశనమును సేవించుటచేత మాత్రమే పుష్టి బొందగల ప్రాణము అశనము యొక్క నిత్యసేవనచేత బలిష్ఠమై ఆత్మ సంయోగము కొరకు ఊర్ధ్వదిక్కుగా పయనించుటలో యశశ్వి అగుతుంది. ప్రాణమునకు అశనమే నిజమైన అన్నము. అది యోగసాధనయందే సిద్ధమగుతుంది గాన-అయోగస్థులకు అది దొరకని కారణముచే వారు కృశించి చివరకు శ్మశానము చేరెదరు. ("శ్మశాన శరణులీ జనులు" అని అంటారు. బ్రహ్మశ్రీ విజయీంద్ర స్వాములు)

రెండవదైనట్టి మనస్సుకు అమృతపానముయొక్క ఆనందము కావలయును. ప్రాణము యొక్క గతాగతియందు ఏ విధముగా అశనము ఉత్పన్నమగునో అదే రీతి ప్రాణమునుండి దానియొక్క ఊర్ధ్వగమనమునందు అమృతమనే ఒక విశేషమయిన పానీయము అభించి, దాని సేవనముచేత మనస్సు దైహిక బంధమునుండి ముక్తినిపొంది ఆనందించి అనంతత్వపు ఆనందము కొరకు ఆరాటపడునప్పుడు ఆ స్థితి తపస్సు అని పిలువబడుతుంది. ఆనందములేని మనస్సు ఇంకను అస్థిరతయందున్నందున దానికి సంకల్ప-వికల్పముల ద్వంద్వము తప్పదు. ఎందుకంటే అమృతము మరియు ఆనందము మనస్సుకు అతి ముఖ్యమైన ఆవశ్యకతలు.

ఇక మూడవదైన ఆత్మకు శాంతియే పరమగతి. శాంతిలేని శాంతినిపొందని, ఆత్మకు వేరేదేదైనను సాధ్యము కాగలదైనప్పటికి, శాంతి లేనందున అక్కడ ఇంకా అపూర్ణత వుండేవుంటుంది. శాంతినిపొందినప్పుడు ఆత్మ శాంతమౌతుంది, శాంతే మనము పొంద గలిగిన పరమగతి. అది కేవలము యోగి సొత్తు. మనిషి యోగి అయితే తప్ప శాంతి సాధ్యము

కాదు.

ప్రభువులు స్వావలంబనము ఉండనీ, పరాశ్రయము వద్దు అని అన్నారు. ఏది పరాశ్రయము? ఉపనిషత్తునందలి 'పరా' 'అపరా' శబ్దముల ప్రయోగమును చూసినప్పుడు పర అనగా దైవము, పరబ్రహ్మము మొదలయిన అర్థము వస్తుంది, ప్రభువులు దైవపు ఆశ్రయము వద్దు అని ఎందుకు చెప్పారు?

ప్రభువుల మరియొక మాటను ఇక్కడ గుర్తుకు (జ్ఞాపకమునకు) తెచ్చుకొనవలసియున్నది. అదియేమనగా

## 11. శాంతియే నా దైవము

వారు శాంతిని దేవుడని సంబోధించిన మహత్వముపై వివరణ వలన స్పష్టము కావలసియున్నది. ఆత్మకు శాంతియే పరమగతి. అదే "పరమ పదవి" అని శ్రీకృష్ణుడు చెప్పుతాడు. పరమగతియైన పరమశాంతి కేవలము యోగియొక్క సొత్తు అని పైన చెప్పబడినది. స్వత : యోగులకు ప్రభుశ్రీ అచ్యుతులు శాంతినికాక వేరే దేనిని ఆశించరు.

పై వివరణలో నాలుగవదగు ఆలంబనమైన దైవమును గురించి ఇంకా ఏమీ చెప్పలేదుకదా! అవును, అది ఇక్కడ రావలసియున్నది. దాని వివరణము ప్రభువుల మరియొకమాటలో ఉంది. అదేమిటంటే.

## 12. నీ కాలిమీద నీ తల, నీ తలకు నీ చేయి

మనిషి మరియు దైవమునకుండే సంబంధము గురించి ఎక్కువ చర్చ అనవసరము. మన స్వరూపమునకు మూలము దైవమే అయినందున దానిని నిరాకరించు ప్రశ్న ఇక్కడ అనుచితము, అయితే మనిషి ఎంతవరకు దైవమునే ఆధారముగా జేసి కొని బ్రతుకవలయును అను దానిని వివేచించవలసియున్నది. దైవము మనకు వర్ణనాతీత స్వరూపమును ఇచ్చి సమగ్ర జీవితమనకు కావలసిన సంపత్తును ఇచ్చి కర్మబద్ధముగా జీవించి, సుఖించి, అనుభవించి అర్థము చేసికొని ఆనందించి సౌందర్యమును చూచుటకు గాను పంపించిన కారణముచే మనిషి స్వతంత్రముగా బ్రతుకుటను నేర్చుకొనవలయునేగానీ వృథా మరియు అర్థములేని భక్తి, పూజ మొదలైన వాటిలో మునిగి ఆత్మవంచన చేసికొన్నచో బాధ్యత దేవుడు కాదు.

కనుక మనిషి ఏదేవుడికోసము వృధాగా పరితపించే శ్రమకు లోనుగాకుండా దైవదత్తమై వచ్చిన జీవన తంత్రమును బుద్ధిబలముతో నేర్చుకొని, తనను తాను తెలిసికొని, మోసుకొని తెచ్చిన కర్తవ్యమును పూర్తిచేయుటయే ముక్తి మోక్షము. ఇది తప్ప వేరే ఏమిలేదు. లేదనునదే తత్వము యొక్క ఖండితమయిన నిర్ణయము.

యోగసాధకుడు ఎల్లప్పుడు స్వావలంబిగానే ఉంటాడు. సదా కర్తవ్యమందే తన్మయుడై ఉంటాడు. అతనికి ఏకదృష్టి ఉంటుంది. అతడు ఏకదంతి. అంటే ఒకే ధృడత్వములో ఉంటాడు. అతడు మరియెవరికి తలవంచజాలడు. అతనికి అతడే గురువు. అతడే మార్గదర్శకుడు, అతడే దైవము. అతడు ఎంతెంతగా కేవలము కర్తవ్యమునందే తన్మయుడు కాగలడో అంతతంతగా దైవము అతని అభివృద్ధికి సహాయకమై సదా సిద్ధముగా ఉంటుంది. అతడు తానుగా దైవమును ఏమి యాచించజాలడు. దైవమునకు తెలియనిది ఏమున్నది? ఎప్పుడు సాధకుని ఉనికి దైవబద్ధమై సాగునో అప్పుడు అటువంటివాని సంపూర్ణ బాధ్యతను దైవమేతీసికుంటుంది. ఇందులకు భగవద్గీతయే సాక్షి. దీనిని నొక్కి చెప్పుచూ ప్రభువులు,

## 13. దేవుని గురించిన మాటే వద్దు. కర్తవ్యము పట్ల ఔదాసీన్యము వద్దు.

## 14. కర్తవ్యముపై లక్ష్యముండనీ

అని హెచ్చరించుచున్నారు. ప్రభువులు యోగిపరంపరవలెనే, కర్తవ్యదక్షులుగానే బ్రతికిరి, వారు దేవుని గురించి ఎప్పుడూ మాట లాడేవారు కాదు. అంటే వారు దేవుని తిరస్కరించిరా? అనుప్రశ్నవద్దు. ఎందుకంటె వారు "దేవుని గురించి ఆ మురికి నోటితో ఎందుకు మాటలాడెదరు? ఆయనను మనము ఏమి చూచితిమి? అని మందలించుచుండేవారు ప్రభువులు "దేవుని, కఠోపనిషత్తులో లాగా, "పరశ్రేష్ఠా" అని పిలిచినారు. "కర్తవ్యముపై లక్షముండనీ" అనునది ప్రభువుల తత్వపుసారము. దానికంటే వేరైన దైవము మరి ఏమున్నది? మనము చేయవలసిన కర్తవ్యమే మనకుండే దైవము. కర్తవ్య పాలనమే మనము దేవునికి చెల్లించగల భక్తి, పూజ, సేవ మన బాహ్యము ధ్యానమనుకుంటూ వచ్చిన అంతరిక కృత్రిమతకు దైవము వశమౌతుంది అనునది కేవలము భాల భాష. దైవమును ఈ రీతిగా ఎవరూ దూషించకూడదు.

శ్రీకృష్ణుని "కర్మయోగము" మరియు ప్రభువుల "కర్తవ్యము" ఒకే దానిని సూచించున్నవి.

## 15. చదివి చచ్చేకంటే ఊది చావండి

## 16. కేవలం గ్రంథవాసనలోనే మునిగి స్వధర్మానికి హాని తెచ్చుకొనకండి

## 17. తత్వమంటే ఎక్కడెక్కడో చదివి ముగించే కంతుల బొంతకాదు.

గ్రంథము అంటే గ్రంథుల సముదాయము. గ్రంధి అంటే మాంసఖండముల పెనవేతవలన అయిన ముడిలాంటి వస్తువు. మనుష్య దేహములో అనేక గ్రంథులుండి, అవి అనేక రకములయిన రసములను స్రవించుచున్నవి. ఈ రసములు దేహపు పెరుగుదలకు కావలసినవై యున్నందున, అవి లేనప్పుడు దేహము తన పెరుగుదలలో వ్యత్యాసమును పొందుతుంది.

రెండు విధములైన గ్రంధులను గురించి శారీరక విజ్ఞానులు చాలినంత అధ్యయనము చేసినారు. ఒక రకపు గ్రంధులను అంతః స్రావిత గ్రంధులనియు, మరొక రకపు గ్రంధులను బహిఃస్రావితగ్రంథులనియుగుర్తించినా రు అంతఃస్రావిత గ్రంథులను నిర్నాళ గ్రంథులనియు పిలిచెదరు. ఇది ఎందుకంటే ఆ గ్రంథులు తమ రసమును ("హార్మోను" అని దానికి పేరు). నేరుగా రక్తములోకి ప్రసరించుతాయి.

కానీ వైద్య విజ్ఞానమునకు ఇంకను దొరకని కొన్ని గ్రంథులున్నవి. వాటిలో రెండు రకములు ఉండుటను యోగవిజ్ఞానము ద్వారా తెలుసుకొనవచ్చును, ఒక గుంపును స్థూలమనియు, మరి యొకదానిని సూక్ష్మమనియు పిలువవచ్చును, స్థూలము యొక్క ముఖ్యమైన గ్రంథులేవంటే హృదయము మరియు మెదడు. సూక్ష్మము యొక్క ముఖ్యమైన గ్రంథులేవనగా, మనోగ్రంధి, మేధో గ్రంధి, శక్తగ్రంధి, సిద్ధిగ్రంధి కల్పగ్రంధి.

యౌగిక క్రమము యొక్క తీవ్రతలో సాగే సాధకునికి ఈ అన్ని విధముల గ్రంధుల పరిపుష్టి స్రావముచేత సాధన పక్వమౌతుంది. సాధన యొక్క పక్వతకు, పొందదగిన జ్ఞానము, అనుభవమునకు ఒక విధమగు ఆత్మయాలింగనమున్నది. ఒక దాని తీవ్రత వలన మరొకదానిలో కూడా తీవ్రత యేర్పడి తరించుట సాధ్యమౌతుంది.

ఉదాహరణకు, ఉపనిషత్‌నందు 'భిద్యతేహృదయ గ్రంథిః చిద్యంతే సర్వ సంశయః అనుమాట యొకటి యున్నది. హృదయ మనే గ్రంథియొక్క వికాసమువలన జ్ఞానోదయమగునని గ్రహీతార్థము. అయితే ఇది సరియేనా అనునది ప్రశ్న. ఎందుకంటే సామాన్యముగా హృదయమనబడే వస్తువు "(Heart)" యొక్క బయట పొర తెరచు కున్నప్పుడు జ్ఞానము యొక్క వాకిలి తెరిచినట్లే అని అర్థము చెప్ప వలయును. ఎందుకంటే దాని తర్వాత గుడా సంశయములు కొంచె ముగానయినను, మిగిలియుండే అవకాశమున్నది.

అయితే ఉపనిషన్మహర్షులు మెదడుకు హృదయమని పేర్కొన్న అవకాశము ఎక్కువగా యున్నది. బ్రహ్మస్థానమైన మెదడు వికసించినప్పుడు ('సహస్రారకమలము') తత్వజ్ఞానమేర్పడుట సాధ్యమౌతుంది.

గ్రంథుల వికాసమేర్పడినప్పుడు వాటినుండి మోహకమైన సూవాసనలు వస్తాయి. వాటిని సాధకులు ఎరుగుదురు. అయితే సూక్ష్మగ్రంథులు వికసించినప్పుడు మనస్సు, మేథస్సు, శక్తి, సిద్ధి, సంకల్పములు ప్రబలములై పురుషునికి ప్రకాశమునిస్తాయి, ఇది యోగముచేత మాత్రముసాధ్యమగునట్టి అంతరికస్ఫోటము,లేక యౌగిక స్ఫోటము (yogic implosion) అని పిలువచ్చును. అదయి నప్పుడు మనుష్యత్వము యొక్క అన్ని గుణములు స్వతః ఉద్భవించి మనకు దత్తమైనట్లే.

జ్ఞానపు ఆశవలన కొంతమంది సాధకులు తమ సాధనను కేవలము గ్రంథుల వికాసము కొఱకే ఉపయోగించే అవకాశమున్నది. అందువలన సాధనకు దెబ్బతగిలి, అది నిలిచిపోయింది. ఆ దెబ్బ మన స్వధర్మమునకు తగలే దెబ్బ.

ఇక్కడ ప్రభువులు దేనిని 'స్వధర్మము' అని అన్నారు? ఇంతకుముందే మనుష్య జీవనమునకున్న నాలుగు ఆలంబనములను తెలిపియున్నాము. నాలుగింటిలో మొదటి మూడు ఆలంబనములగు ప్రాణము, మనస్సు మరియు ఆత్మ, మనలో నాలుగవదగు దైవమును ఆధారము చేసికొని, ఏర్పాటయి సాగవలసియున్న విధమును ప్రభువులు స్వధర్మమని అన్నారు. ప్రాణ-మనో-మిలనము వలన ఆత్మవంతులై, కర్తవ్యమును గుర్తెరిగి ( తెలుసుకొని) దైవ లీలనూ తెలుసుకొని దానికి పూరకముగా సాగినపుడుమ నము మన కున్న ధర్మమునకు బద్ధులమై జీవించినట్లే. అదే మనము కనుగొన వలసిన స్వధర్మము.

ఇదంతా కావలసియున్నందున, ఆ నిగూఢ గర్భమును భేదించ గల సూత్రము యోగమై మనకు చిక్కినది. దానిని "ఊదుట'' అని ప్రభువులు పిలిచినారు ఊది ఊది మనము చచ్చిపోయెదము. అంటే ఇపుడు మనలో ఉండే నాశనము కావలసియేయున్న, అసత్తును యోగపు క్రమములో భస్మము చేసికొని,సత్తయిన దేహమును కట్టు కొనవలసి యున్నది. ఈ క్రియను ఉపనిషత్తు "భస్మాంతం శరీరం'' అను మంత్రములో సూచించినది. పుట్టిన మనుష్యుడు చచ్చి మరల పుట్టివచ్చే క్రమమునకు "ద్విజత్వ''మను పేరున్నది. ఎవరు ధీరులై ద్విజత్వము పొందినారో, వారే ద్విజులు. అనగా వేదాధికారమున బ్రహ్మణుడు. వారికే వేదాధికారముః ఎందుకంటే వారు వేదమును వేద్యముగావించుకున్న ధీరులు, జ్ఞానులు. వేదములో మాత్రము ఏమున్నది ? అలా వేద్యము కావించుకున్న ధీరులు, ఇతరులకు ఇచ్చినట్టి దానిని, అనంతరము వ్రాసిపెట్టబడిన గ్రంథముల రాశి. కేవలము వాటని చదువుతూపోతే వచ్చేది జ్ఞానము కాదు. చింత, బాధ, చావు.

తత్వముండేది గ్రంథములలోనూ కాదు, గ్రంథులలోనూ కాదు. దానిని కఠిన శ్రమచేత పొందవలయునంతే ! అంతేకాదు కేవలము తపస్సు చేతనే జ్ఞానము రాదు అని బ్రహ్మశ్రీ విజయీంద్ర స్వాములు చాటుతున్నారు. జ్ఞానమును

శ్రమతోను, దైవకృపచేతను, గురువుయొక్క అంతఃకరణ చేత పొందవలసినదే కానీ దానంతటది రాదు. తపస్సువలన అహంకారము రావచ్చును అంతే.

తపస్సు చేసేదింతే. మన దేహయంత్రమును పరిశుభ్రత వైపుకు తీసికొనిపోయిదాని లోపల ఉన్న స్థూల-సూక్ష్మ వస్తువులను దాని దాని ఉచ్ఛస్థితికి తీసికొనిపోతుంది. తరువాత మనము మనలను వ్యవస్థీకరించుకొని సృష్టి, స్థితి, దైవలీల లేక మాయయొక్క క్రమమును అతి సూక్ష్మముగా గమనించినప్పుడు అన్నింటి యొక్క జ్ఞానము కలుగుతుందే తప్ప కేవలం 'పుసు పుసు' జపము వలన కాదు. ఈ హెచ్చరిక మనకందరకూ ఉండుగాక.

ధర్మము అతి సూక్ష్మమైనటువంటిది. సాధనయు మెట్టు మెట్టుగా పైకెక్కినట్లే ధర్మము సూక్ష్మాతి సూక్ష్మమగుచు కనులకు గోచరమౌతుంది. అక్కడ, ఆ ఊర్ధ్వగతి ప్రయాణములో, క్షణములో వెయ్యోవంతుపాటు మాయయొక్క మబ్బుక్రమ్ముకొన్నను మనము ఓడిపోయినట్లే. అక్కడ కూడా ఓడిపోని స్థితిని యోగి యొక్క స్థితియని చెప్పవచ్చును ఇలా ఉన్న యోగములో ఉత్తీర్ణతయనునది సులభమైన మాట కాదు. మాయ యొక్క మబ్బువలన మన స్వధర్మమునకు దెబ్బ తగులుతుంది. దెబ్బతిన్న స్వధర్మమును సరిచేయుట అంటే సగము సృష్టినే సిరిచేసినట్లు ఎందుకంటే ఒక పురుషుడు అతి-ఉన్నత మట్టమునందు క్షణములో వెయ్యోవంతు పాటు తప్పినా దాని దెబ్బ సృష్టికి తగులుతుంది. ఆ కారణముచే శ్రేష్ఠ వ్యక్తి యెన్నడూ తప్పజాలడు. ఇంత శ్రేష్ఠ కల్పన యొక్క స్వధర్మమును శ్రీకృష్ణుడు కూడ ఇచ్చియున్నాడు. గీత యొక్క "స్వధర్మే నిధనమ్ శ్రేయః" గుర్తుండనీ

## 18. దేహదండనము, వ్యాయామము, లోకోపయోగ కర్తవ్యమును చేయండి.

## 19. ఎక్కువ సేపు కూర్చుని కాలయాపన చేయకండి.

## 20. మీరు చేయదగిన కార్యములు నేర్వదగిన విద్యలు లోక కళ్యాణము కొఱకై యుండనిండు.

## 20. సమాధి మబ్బులో పడకండి

దేహమునే చిన్న లోకములో మనము బ్రతుకుచున్నాము. దాని కళ్యాణమును సాధించుకొనుటయే మనకుండే మొదటి కర్తవ్యము యోగసాధన కళ్యాణకారకము. అది మనలను ముసలితనము మరియు మృత్యుభయమునుండి తప్పించి అమృతత్వము వైపు తీసుకొని పోతుంది. అందవలన యోగసాధనము మనకుండే మొదటి కర్తవ్యము.

బయట ఉండే పెద్దలోకపు కళ్యాణము జరుగవలెనంటె అది మనలో ఉన్న చిన్నలోకపు కళ్యాణమువలననే సాధ్యమగును దానివలననేఇది అయినప్పటికి దీని కళ్యాణమువలననే దాని కళ్యాణము సాధ్యమగును. కావున దీనిపై మనము ఎక్కువ లక్ష్యముంచవలయును. సృష్టికొక కర్త ఉండి, సృష్టించబడిన దానిని రక్షించుటకు ఒక నాయకుడు అట్లే అతని పాలనా యంత్రాంగమున్నది. అతనిని విష్ణువు అనిపిలిచినారు మన చిన్నలోకము సృష్టింపబడి యున్నందున, దానిని రక్షించు భారమును, విష్ణువుకు, ఒప్పజెప్పినచో నాశనమనే రుద్రదేవుని ప్రళయము తప్పును.

యోగసాధనపు ప్రాణాయామముచేత, అనగా ప్రాణపు ఆయామముచేత, దేహమును దండించునప్పుడు, అనగా

శిక్షించునప్పుడు, సరిచేయునప్పుడు, దేహదండము సిద్ధమౌతుంది. ప్రాణము పైకి ప్రయాణించుటకు దేహమునకు ఈ దండము, అనగా వెన్నుపూస అవసరము. పైకి పోవుటకు గాను ఆయా మించవలసియున్న ఈ ప్రాణము ఆత్మతో కలిసి ఒకటై, మరల వేర్పడి క్రిందికి వ్యాయామించవలసియున్నది. ప్రాణము యొక్క ఆయామ- వ్యాయామముల చేత మాత్రమే లోకమనేదేహమునకు ఉపయోగము అనగా కళ్యాణము అవుచున్నందున, అంతటి కర్తవ్యమును చేయండి అంటున్నారు ప్రభువులు.

ప్రాణమునకు మూడు పాదములున్నవి. మూడు పాదములు మూడు లోకములను వ్యాపించుకొని యున్నవి. నాభినుండి బ్రహ్మరంధ్రములోనికి ప్రయాణము చేసిన ప్రాణచేతనము హృదయమును కార్యక్షేత్రముగా చేసికొని ఉంటూ, అక్కడ సర్వదా స్పందించుతూ ఉంటూ, యోగపు గతాగతిలో అది హృదయమును వదిలి బయటకు వస్తుంది.

అనంతరము ప్రాణము మూత్రపిండము ద్వారా వెన్నె ముకలో చేరి ప్రయాణము సాగించుతుంది. మూత్రపిండము నుండి మెదడు యొక్క బయటి వాకిలియైన మెడుల్లా వరకు గల రెండవ లోకమే ప్రాణము యొక్క రెండవ పాదము. తరువాతది మూడవ పాదము. అది కేవలము మెదడుకు మాత్రమే పరిమితమైనప్పటికి, అచ్చటి పయనమే బహుకష్టమైనది, బహు దూరమైనది అయిఉన్నది. రెండవ పాదములో సంచరించు ప్రాణమునకు, రెండు స్థానములు లేక విశ్రాంతి స్థలములు ఉన్నవి. మొదటిది మూత్రపిండము, రెండవది మెడుల్లా మూడవ పాదములో బ్రహ్మరంధ్రము దాని మిశ్రమ స్థలము.

యోగమార్గపు సాధనలో సాగే సాధకులకు ప్రాణము యొక్క గతి సంపూర్ణముగా వేద్యము కాగలదు. ప్రాణము సర్వదా క్రియయందే నిమగ్నమైయుండే ఒక శ్రేష్ఠ శక్తి. దానికి క్షణమాత్రము కూడా విశ్రాంతిలేదు. అది నిరంతరమూ స్పందించుచునే ఉంటుంది. అయితే ప్రాణము యొక్క ఈ స్థితి ఆత్మతోటి సంయోగములో మాత్రమే కనబడుతున్నందున, ఉపనిషత్తు"న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన" - అని చెప్పినది. అయితే అచ్చటనూ దాని క్రియ ఉండే ఉంటుంది.

ఒక్కొక్కసారి ఈ ప్రాణము ఆకస్మిక బంధనమునకు లోనై నప్పుడు సమాధి అనే ఒక విధమైన మబ్బు మూసుకొన్న స్థితి వస్తుంది. సమాధి స్థితిలో మనిషి అనంత కాలముపాటు జీవించి ఉండుటకూ సాధ్యమౌతుంది. అయితే అది తగదు అని ప్రభువులు నిర్ణయించినారు. తానుగా వచ్చి ఏర్పడే సమాధినుండి దాటుకొని ఆధ్యాత్మిక ప్రయాణమును సాగించవలెనేగాని అక్కడే జడమై కూర్చొని కాలయాపనము చేయకండి అన్నారు ప్రభువులు.

ఈశావాస్యోపనిషత్తు విద్యకు మహత్వమునిచ్చి, దాని ఉపాసనను చెప్పినప్పటికి, కేవలము యాంత్రికమైన విద్యయందు సాగిపోవుట మనలను ఆవిద్యనుండి వచ్చు అంధకారముకంటే ఎక్కువైన మరియొక అంధకారములో పడదోస్తుంది అని స్పష్టముగా ఘోషించినది. కావున సమాధి యొక్క మబ్బులో కూర్చుని వ్యర్థముగా కాలము గడుపుట వలన కర్మద్రోహమగుచున్నందున ఈ హెచ్చరిక.

## 22. మరియొకరిని తన వాక్చాతుర్యాది నటనల వలన తన స్వాధీనములోనికి లాగకూడదు.

యోగ సాధనలో ప్రాణమును వాయువు యొక్క మథనము నందుంచి ఊదునపుడు ఝంకార నాదము ఉత్పన్నమవుతుంది. ఉత్పన్నమైన నాదము ప్రాణముయొక్క స్థూల పూజయని అనిపించు కుంటుంది. నాదము ప్రాణదేవునికి మనము చేయగల స్థూలపూజ. ఇది అంటే నాదము యోగపువాక్కు, ఎందుకంటే మన పుప్పుసముందు (శ్వాసకోశమునందు)

సంచరించు వాయువును కంఠనాళపు వివిధ మాంస ఖండముల ఒత్తిడికి లోబరచినప్పుడు వాగింద్రియమనిపించు కునే నోరు, నాలుక, కొండనాలుకల సహాయముతో కలుగునట్టి (ఏర్పడునట్టి) శబ్దసంచయము ఈ నాదము.

జపము యొక్క ఈ స్థూలస్థితిలో సాగినప్పుడు వాగీంద్రియపు సహాయము అత్యావశ్యకమై, జపము యొక్క శబ్దము వాక్కు అని నిర్దేశింపబడినది. అయితే ఇక్కడొక గండమున్నది. సాధకులు మనోమోహక (మనోహర) శబ్దమునందు మరులుగొని, ప్రాణపు వాక్కును మరింత ఆకర్షకముగా చేసుకొనవలెననెడి చాపల్యముతో దానియొక్క గతాగతిని మార్చుకొని, కేవలము చతురనటనతోనే సాగిపోయే అవకాశము లేకపోలేదు. పూర్వమునందు (మొదట్లో) ప్రాణపు గతాగతి యొక్క శబ్దము కర్కశమై యుండవచ్చును, కాని తరువాత అది తన స్వాభావికతను కనుగొన్నప్పుడు దాని శబ్దము మారిపోయి మధురవాణి అవుతుంది. వాణి సరస్వతి యొక్క నామాంతరము ఇక్కడ సరస్వతి అంటే జీవనమునకు సాఫల్యము ఇచ్చు అనేక రసములలో శ్రేష్ఠరసమైన అమృతమును పానముచేసిన మీదట మనస్సుతోపాటు ప్రాణమూ పుష్టమై తన విశేషరీతిలో నుండు ఝుంకారముతో తూగాడునప్పుడు ఉత్పన్నమగు కర్ణమధుర నాదము. సరస్వతి యొక్క వీణా ఝుంకారము నుండి వెలువడు వాణి సహజముగా ఉంటేనే మంచిది. ఎటువంటి స్థూల ప్రయత్నము లేకుండానే వాణి వెలువడి రావలసియున్నది. అది దాని స్వభావము. సహజమైన వాణిని అజపా గాయత్రీ అనియు పిలిచెదరు.

వాణికి నాదమున్నది, నాదమునకు తాళమున్నది. దానిని వినునప్పుడు మనస్సు మోహించి ప్రాణముతో ఒకటవుతుంది. అట్లయి నప్పుడు యోగము ఒక స్థాయికి వచ్చినట్లే. ముందు మరెంతో ఉన్నది.

## 23. ఒకరివలన ఇతరుల కెవరికీ ఇబ్బంది కలుగరాదు

యోగమనెడి జపము మనము చేసియే తీరవలసిన అతిముఖ్య మైన స్థూలకార్యము. దానిని ఆసనములో కూర్చొని చేయవలసి యున్నది. జపమునకూ ఒక క్రమము ఉన్నది. జపమునకు కూర్చొని నపుడు దేహము యొక్క ఏ అవయవమునకు ఒత్తిడి తగలరాదు. తల మరియు అన్ని అవయవములను స్వేచ్ఛగా నుంచి కూర్చొన వలయును. ఏ ఒక్క నరమునకు నొప్పి తగులకుండా జపమును చేయుటయే జపకౌశల్యము. అచ్చట సహజత ఉండవలెనేకాని హఠము - కష్టము పనికిరాదు. దేనినైనాగానీ బాధ కలుగునట్లు చేయరాదు. హఠము చేసే బిడ్డను లేదా ముసుగు పెట్టుకొని పడుకొని యున్న అలిగిన ప్రేయసిని ప్రీతితో వశము చేసుకొనునట్లుగానే జపమునందు మనము మన సర్వస్వమును నిదానముగా, ప్రీతితో, ఆదరముతో, సహజతతో వశపరుచుకొనవలయును.

## 24. మనము చేయు ప్రతి కార్యమూ దేవుడి సేవ అనుధృడ నిశ్చయముతో సాగవలెను.

కర్మపరిపాలనమే మనం చేయగల దేవుని సేవ. ఎందుకంటే మనకుండు కర్మము మనకు దైవదత్తమయ్యే వచ్చినది. సమర్పక మయిన ఇంద్రియ కర్మాచరణము వలన భౌతిక సంపూర్ణతనూ, నిరీంద్రియపు అంతరిక తపస్సుచేత భవ్యపూర్ణతను పొందినప్పుడు మనము కర్మపాశమునుండి విడుదల పొందినట్లే. అట్లయినను కర్మ మునకు అంతమనునది లేదు. అది మనము మన స్వరూపము ఉండు నంతవరకు చేయవలసియున్న ఆవశ్యక కార్యము. యోగమునందు ఉత్తీర్ణత పొందినప్పుడు దాని పాశము లేక లేశము లేనిదవుతుంది. అట్లయినప్పుడు స్థూలపు స్వాతంత్ర్యమును మనము పొందినట్లే. అది ముక్తస్థితి. ఎందుకంటే అచ్చట బంధములేదు. ఇలా ఏ మనుష్యుడు తనకున్న స్థూలపు దైహిక కార్యమును, సూక్ష్మపు తపస్సున

సమర్పకముగా చేసుకొను అతడు దేవుని సేవలు చేసినట్లే దానికంటే ఎక్కువైన సేవలేదు. లేదు. లేదు. "కర్మములందలి కుశలతయే యోగము'' అని చెప్పుచున్నాడు శ్రీకృష్ణుడు.

## 25. లోకపు ధర్మము కర్తవ్యములందు అన్యోన్య ప్రేమ మరియు పరస్పర సహాయము ఉండనీ

మన లోకమైన మన దేహములో నెలకొని యుండే నాలుగు ఆలంబనములగు ప్రాణము, మనస్సు, ఆత్మ మరియు దైవము గురించి వెనుక చెప్పబడినది గదా! వాటి యొక్క ఏర్పాటు మరియు నడచు క్రమమునకు ధర్మము అని అన్నారు. ఈ వ్యవస్థ ఆదినుండి వచ్చియున్న కారణమున ఆది ధర్మం అని ప్రభువులు చెప్పినారు. (ఆదిధర్మమునకు ఇంకా ఎక్కువ అర్థమున్నను, ఇక్కడ అది అప్రస్తుతము అని భావన). స్వావలంబనములను అనుసరించి జీవించుట మన కర్తవ్యము. ఇట్లు అగుటకు యోగసాధన కావలయును. ఈ నాలుగింటి కలయికతో అన్యోన్యత కనబడనిచో సత్యానాశమగును. ఉపనిషత్తు "సహనావవతు, సహనౌభునక్తు'' అని సర్వాదా పఠించు చూనే యున్నది. యోగపు అర్థమయినను ఇంతేకదా ! సర్వము యొక్క మిలనము, సర్వము కొఱకు సర్వము యొక్క మిలనము అది. అది అతి రహస్యమయిన తంత్రము లేక కుశలత. కుశలత కేవలము ధీరుల సొత్తు. ఇక్కడ ధీరుడనగా ధీశక్తిని ఉద్దీపనము చేసికొనిన వీరుడు. వీరుడనగా దైహిక శక్తిని రెచ్చగొట్టి, వికసింపజేసి నిలిచినవాడు అని అర్థము. ఎవరు దైహిక శక్తిని మరియు భౌతిక శక్తిని సమతూకములో వశపరచుకొని ఆత్మవిశ్వాసముతో నిలువగలరో వారే ధీరులు. అట్టి ధీరులకు మాత్రమే శాశ్వత సుఖము ఇతరులకు కాదు అంటుంది. ఉపనిషత్తు. "ధీరాస్తే షాం సుఖం శాశ్వతం, నేతరేషామ్'. ఎవరి అంతరిక శక్తులు అన్యోన్య ప్రేమ, పరస్పర సహాయములవలన సాగునో వారు ధీరులౌతారు. వారికి యోగము సిద్ధిస్తుంది.

## 26. మనము, మనవారు, మనకు అనుదానిని దురాశ అయ్యేటట్లుగా ఉంచుకొనరాదు

మనుష్య జీవితముకుండె స్థూల, సూక్ష్మగతులను చెప్పియున్నాము. స్థూలపు గతిలో మనిషి కేవలము ఇంద్రియ లేక దైహికముగా పెరుగుచూ బ్రతికి చివరికొకప్పుడు చనిపోవును. దీనిని ప్రాణులు కూడా చేయుచున్నవి. బ్రతుకు కావలసిన ఆహార -విహారముల వ్యవస్థ మనుష్య-ప్రాణివర్గమునకు సహజముగా ఇవ్వబడినది. అయితే ఈ రీతి బ్రతుకుకు జీవితమనిపించుకొనజాలదు. జీవనము లేక జీవించుట అంటే సూక్ష్మగతిని అనుసరించిన బ్రతుకు. ఈ జీవనము కేవలము మనుష్యవర్గమునకు మాత్రము ఇవ్వబడినది. అయితే మనుష్యులు దానిని తెలియకనే దుఃఖమునందున్నారు. మనుష్యుల దుఃఖనివారణ ఎట్లు కాగలదు అనుదానికి శ్రీకృష్ణుడు సరియైన ఉత్తరమును ఇచ్చినాడు. "యోగోభవతి దుఃఖహ'' అని ఘోషించినాడు. యోగము మనుష్యుల దుఃఖమును నివారించగల ఏకైక మార్గము మనకుండుచ్యుతిని ( అంటే అజ్ఞానము, దుఃఖము, స్వార్థము, అల్పత్వము, ద్వేషము, అసూయ, దురహంకారము, కీర్తి, మోహము, ధనదాహము) నివారించగల ఏకైక మార్గమైన యోగ విద్యను దానము చేయువారికి ఉపదేశకుడు, బోధకుడు, గురువు మొదలైన పేర్లు ఉన్నవి. సనాతనము, గుహ్యము, శ్రేష్ఠము, ఏకైకము అయిఉన్న ఈ ఆదివిద్యను దానముచేయు మహనీయులు పై చెప్పిన చ్యుతులను కొంచెముగానయినను పోగొట్టుకొనియుందు రని భావించవచ్చునుకదా ! అయితే ప్రస్తుత స్థితి అలాలేదేమో?

గురుబోధకులకు గురుబాధ అనే మహారోగము వస్తూ ఉంటుంది. గురుబాధతో మూలిగే గురుబోధకులు

అచ్యుతమైన విద్యయొక్క సహవాసమునందున్నను మాయపాశమునకు లోనయిపైన చెప్పబడిన అన్ని రకముల చ్యుతులను ప్రదర్శించుదురు. ఇది ద్రోహము అంటారు ప్రభువులు.

మనము, మనవారు, మనకు అను భావన అందరిలోనూ ఉండవలసినదే. అయితే దురాశలో పడిన బోధకులు క్రమేణ ఆ వ్యవహారములో మునిగి కష్టపరంపరకు దుఃఖమునకు లోనవుతారు. అట్టివారినుండి యోగము దూరమౌతుంది. ఇదికాకుండా ఉండాలంటే సాధకులు మరియు బోధకులు భక్తి, వినయము, స్నేహము, గౌరవములను ఇచ్చిపుచ్చుకొనుటను అలవాటు చేసికొనవలసియే ఉంటుంది.

బ్రహ్మత్వమును ఒకసారి పొందినచో అది శాశ్వతముగా ఉంటుందనేది కేవలము అల్పులమాట. ఉపనిషత్తునందలి ఈ క్రింది మంత్రమును చూడండి.

"మాహం బ్రహ్మ నిరాకుర్యాం, మామా బ్రహ్మ నిరాకరోద నిరాకరణం మేస్తు అనిరాకరణమస్తు......"

దీని అర్థమింతే బ్రహ్మత్వమును నేను నిరాకరించకుండా ఉండుగాక! నన్ను బ్రహ్మత్వము నిరాకరించకుండా ఉండనీ, మా ఇద్దరిలో నిరాకరణమనునదే లేకుండా ఉండనీ". మాయాపాశము ఎల్లప్పుడూ బలముగా ఉంటుంది. దానినుండి దూరముగా ఉండుట గురుబోధకులకూ కష్టమే !

## 27. ఇతరులను గానీ, ఇతరుల మతమునుకానీ దూషించ కూడదు, ఇతరుల భాగ్యమును చూచి అసూయపడ కూడదు

సృష్టి ఒకటే, అయిననూ దానిలో ఉండే జీవ-జడముల భేద ములు అనంతము. ఇది ఏకత్వముల కానవచ్చు భిన్నత్వము. జీవ జడవర్గములో విశిష్టమైన అవినాభావ సంబంధమున్నది. దానిని తెలుసుకొనుట సామాన్యులకు అలవి కానప్పటికీ తపస్సు ద్వారా వారికీ అది సాధ్యమౌతుంది. సృష్టికి మూలము ఒకటే అయిననూ, సృష్టిలో వచ్చియున్న ఒక్కొక్క వర్గపు వస్తువులలో భిన్నత్వము ఎందుకున్నది? ఉదాహణకు, ఒక మనిషివలె మరొక మనిషిలేడు. ఒక రాయివలె మరొకటి లేదు. అతి సూక్ష్మపు పరమాణువువలన సృష్టి అయిననూ, ఒక వర్గపు పరమాణువులో కూడా పరస్పర భిన్నత్వము ఉన్నది అని భారతీయ తత్వజ్ఞులలో వైశేషికులు, జైనులు చెప్పియున్నారు. దీనికి కారణమేమి?

జీవ లేక జడ వస్తువుల భిన్నతకు భిన్నగుణము, భిన్న సంస్కారము, భిన్నకర్మ భిన్న కాలము, భిన్నవికాసము కారణము. మూలమునుండి బయటకు వచ్చునప్పుడూ, వచ్చే సమయము ననుసరించి భిన్నత కనబడుతుంది. భిన్నత కనుగుణముగా ప్రతియొక్క జాతి వస్తువులకు తమదే, అయిన ఒక విశిష్ట రీతి జీవన క్రమము ఉంటుంది. ఆయా క్రమమును తెలుసుకొని వస్తువులు తమ తమ వికాస-ఉత్క్రాంతిని చేసుకుంటవి. వస్తువుల స్వభావమును మార్చుట కుదరదు. మనుష్యుల ఉదాహణను తీసికుంటే వారిలో భిన్నత్వము అతి స్పష్టముగా కనబడుతుంది భిన్న సృష్టి భిన్న దృష్టి భిన్న స్వభావము, భిన్న కర్మ, భిన్నాకాంక్ష, భిన్న జీవనము, భిన్న జీవితము. మానవత యొక్క మూలము ఒకటే అయిననూ దానికి ఉండే ఇంద్రియ - నిరీంద్రియ స్థితి - గతులు ఒకటే అయిననూ మాట, నడత, ఆచారము. విచారము, నమ్మకము, జ్ఞాన - అజ్ఞానముల స్థితి, గురి మొదలయినవి వేరైఉన్నవి. మానవత ఒకటైనను మానవులు భిన్నులయ్యే మిగిలియున్నారు. ఏకతను మనమీనాడు చూచుటలేదు, మానతలో పెరిగి నిలబడిన ధర్మములెన్ని? మతములెన్ని, తత్వ జ్ఞానములెన్ని, భగవదతార పురుషులనభఢువారి సంఖ్య ఎంత నమ్మిన దేవతలెంత మంది? ఇది ఇట్లే సాగవలసియున్నదా?

సృష్టిలో రెండు రకములశక్తులున్నవి అని గీత చెప్పినది. ఒక దానిని దైవీశక్తియనీ, మరొకదానిని ఆసురీశక్తియని పేర్కొనినది. ఈ రెండు పరస్పర విరుద్ధమగు రీతిలో కార్యోన్ముఖములై యున్నవి. ఈ రెంటిని బంధించి ఉంచిన మూడవదియైన గుప్తశక్తి యొకటి ఉన్నది. గుప్తశక్తి మూడు ఫేజు లున్న విద్యుత్ యొక్క న్యూట్రల్ వంటిది. ఈ మూడు శక్తుల కూటమి యొక్క ఆటయే జగన్నాటకము లేక జగల్లీల అనపడుచున్నది. దేవుడు అప్పుడప్పుడు అధర్మమును అణగద్రొక్కుటకు అవతరించు తాడు అంటే అసురీశక్తి సదా కాలధర్మమును అణగద్రొక్కుట కొఱకే రూపొందించినది అని అర్థమౌతుంది. అంటే దైవపు ప్రణాళికలో మూడు శక్తులకు సమానమైన ప్రతిభ, ప్రతిష్ఠ మరియు శక్తి ఉన్నదని అర్థమగుచున్నది.

దైవీశక్తీయొక్క సంకేతము యోగసాధన. ఎందుకంటే ఇది దానినుండియే వచ్చిన క్రమము. అయితే పైశాచిక శక్తి యోగ సాధనను నిరోధిస్తుంది. యోగసాధన నివృత్తి మార్గమును బోధించితే పైశాచిక శక్తి ప్రవృత్తి మార్గమును మరింత బోధించుచున్నది. ఈ రెంటి ఘర్షణము ఈనాటిది నిన్నటిది కాకుండా అనాదికాలము నుండియు ఉన్నదే అయిఉన్నది. మనుష్యులు తమ వికాస - పరిణామమును అనుసరించి తమకు సరిపడే మార్గమును ఎన్నుకొందురని శ్రీ కృష్ణుడు అభిప్రాయపడినాడు తనను అనుసరించు యోగసాధకులు తనను చేరుదురనియు, పైశాచిక శక్తిని అనుసరించువారు దానినే చేరుదురనియు చెప్పినాడు.

అయితే సాధన సాగుటకు ఈ మూడు శక్తుల అవసరమున్నది. ఎందుకంటే అసురీ శక్తి యొక్క విరోధము అంటే దానియొక్క కోట్లాట, ఘర్షణ లేనట్లయితే సాధనకు చలనమే ఉండదు. కారణమేమంటే మనము దేనినీ దూషించుటలేదు, దోషమును పట్టుటలేదు. గుణాత్మకమునకు ఋణాత్మకపు నిరోధముంటేనే రెండూ సర్వాదా జాగ్రత్తగ ఉండగలవు. ఒక శక్తికి ఇంకొకదాని విరోధపు సహకారము లేనట్లయితే అది నిరుపయోగమైపోతుంది. ఒకదానినొకటి తీవ్రముగా నిరోధించుటలో మాత్రమే వాటికి చలనము దొరికి పరిణామము కనబడుటకు సాధ్యమౌతుంది. ఈ రెండు శక్తుల ఘర్షణను నియంత్రించుచూ ఉండే మూడదైన గుప్తశక్తి నిశ్శబ్దముగా పనిచేస్తూ ఉంటుంది. అది మాయ అయితే ప్రభువుల అర్థములో మాయ అంటే చాలకము (చలింపజేయునది), పోషకము, మార్గదర్శకము, జ్ఞానప్రదాయకము, కృపాదాయకము.

విష్ణువు యొక్క ద్వారాపాలకులయిన జయ-విజయులు కారణాంతరముచే విష్ణువు యొక్క విరోధులుగా పుట్టి, దైత్యులయి ప్రబలులయినప్పుడు మాత్రమే దేవుని అవతరణమయినది కదా! వారి విరోధము లేకుంటే అది సాధ్యమయ్యేదో లేదో? అంతేకాదు ఆ ముగ్గురి ఆట పూర్వమే ప్రణాళికాబద్ధమయినదే కదా!

## 28. మరొకరి వేష, భూషణ, ఐశ్వర్యములకు ముగ్ధులు కాకండి

## 29. మనుష్య జీవనమంటే పక్షి విహారము కాదయ్యా

యోగసాధనయందు దర్శనము, అనుభవములు వైవిధ్య పూర్ణముగాను (రకరకములుగ) అనంతముగాను ఉండును. సాధన యొక్క స్థాయి పెరిగినకొలది దర్శనానుభవము ఉత్తమమౌతుంది. చాలాసార్లు మన ఆత్మ ప్రాణమును వాహనముగా చేసికొని దేహము నుండి బయలువెడలి లోకములను దర్శించి వాటిలో నివసించు వ్యక్తులను కలుసుకొను అవకాశము ఉన్నది. అక్కడి వ్యక్తుల రూపము మనకంటే సుందరముగా ఉండే అవకాశము ఉన్నది. అట్టి దర్శనానుభవమునకు ముగ్ధులమైతే సాధన కుంటుపడుతుంది. గ్రహాంతరయానములో అచ్చట కలిగే అనుభవము పొందుచు పైపైకి పోవలయునే కానీ అక్కడక్కడ నిలిచిపోతుంటే సర్వనాశనము కావచ్చును.

యోగసాధన అంటే కేవలము ఈ రీతిగా ఎగరటము కాదు. ఎందుకంటే ఇట్టి ప్రయాణము కేవలము సహజముగా ఏర్పడుతుందను కారణముచే వీటికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వకూడదు. మనుష్యజీవనపు లక్ష్యము కేవలము పక్షివలె ఎగురుచూ ఉండడము కాదు. తనను తాను తెల్సుకొని సమర్పకముగా జగత్సేవను చేయవలసి యున్నది.

విష్ణువుకు గరుడుడు వాహనమైన కథను మనమందరము వినియే ఉన్నాము. గణపతికి మూషికము వాహనము. వీటిని ఇలాగే అర్థము చేసికొనవలెను.

## ౩౦. స్థానమానములను ఉంచుకొనండి. స్థానమానములను ఇవ్వండి

యోగసాధనకు మూడు స్థానములున్నవి. అవి ఏవనగా గురుస్థాన గుప్తస్థానము మరియు గమ్యస్థానము. సాధనా ప్రారంభము అనగా గురుస్థానము లభింపచేసికొనుట. గురుస్థానము కంఠ ప్రదేశమునందుండి. ఉపజిహ్వా అనబడే కొండనాలుక యొక్క స్థలమై యున్నది. ఆ స్థానమునందు మన గురువైన ప్రాణమును పైకి క్రిందికి అయామించునప్పుడు యోగసాధన అనగా జపము అరంభమైనట్లే! గురువును స్వాధీనము చేసుకుంటూ సాక్షాత్కారింపజేసికొనుటలో చాలనము (progress) దొరకు స్థానము అది అయినందున దానికి గురుస్థానము అని పేరు. ప్రాణపు గతాగతికి రెండు సహకార అంశములు ఉండవలయును. మొదటిది వాయువు. రెండవది మన ఇంద్రియము అని పిలువబడే మనస్సు.

ప్రాణపు అయామమనే గతాగతిలో ప్రాప్తమయే కొన్ని శక్తి వర్ధక రసముల సేచనము (sprinkllng) త్రాగుటచేత పుష్టిని పొందే మనఃప్రాణములు ఇంద్రియముల పట్టునుండి నేర్పుగా తప్పించుకొని సాధన యొక్క రెండవదయిన గుప్తస్థానమును ప్రవేశించి పైకి సాగును. మూత్రకోశమునుండి వెన్నుపూస కొనవరకు గల స్థానము గుప్త స్థానమని నిర్దేశించబడుచున్నది. మనఃప్రాణ శక్తులు మూత్రకోశమునుప్రవేశించి వెన్నుపూస అనగా "మేరుదండ" మైన దానిని దాటుకొని ఇంకా పైకి సాగి, మూడవదైన గమ్యస్థానమును చేరికొనుటలో ప్రాణప్రయాణమునకు తుది దొరికినట్లే. గమ్యస్థానమనగా మనము చేరవలసియున్న స్థానము. అక్కడ మెదడు యొక్క పైభాగమునందు ఆత్మ యొక్క విశ్రమ స్థానమున్నది. ఆత్మను బ్రహ్మ అని అనిన కారణముచే గమ్యస్తానము బ్రహ్మస్థాన మనియు, బ్రహ్మలోకమనియూ పిలువబడినది. మనః ప్రాణములు ఆత్మలో మిలనమయినప్పుడు అక్కడ మిగులునది బ్రహ్మమగు ఆత్మయే. మనయొక్క అన్ని భిన్నతలు నశించినప్పుడు మిగులునది ఆత్మయే. అది అద్వైతము, ఎందుకంటే దానికి రెండవ దేదియులేదు. ఆ స్థితిలో తెలియబడునది సర్వమూ ఆత్మస్వరూపమే. ఆత్మయొక్క వ్యాపకత్వమే విశ్వము. "సర్వం ఖిల్విదం బ్రహ్మ" ఉన్నట్టిది, ఉండునది, నశించునట్లు కనపడ్డప్పుడు కూడా మిగులునది ఆత్మయే. "ఏకోవశీ సర్వభూథాంతరాత్మా" ఇదే ఏకత్వము. "ఏకత్వమును పశ్యంతి" అది యోగపు స్థితి.

ఈ మూడు స్థానములను మూడు లోకములనియు పిలిచినారు. వాటిని భూలోకము భువర్లోకము, సువర్లోకమనియూ భూమి, ఆకాశము అంతరిక్షములనియూ, భూః,భవఃస్వః. అనియూ నామాంతరములచేత వర్ణించినారు. ఆ యోగస్థితియందు వామనులమై యుండు మనము సాధన ద్వారా పెరిగి త్రివిక్రములమై ("తపసాచియతే ప్రాణః, తపసా చీయతే ఆత్మా") మూడడగులతో ముల్లో కములను దాటి ఉత్క్రమించి మూడింటికి అటువైపున ఉన్న దైవస్థితిని చేరగలిగితే మన బ్రతుకు ఉత్తీర్ణత దొరికినట్లే. అట్లగుటకు యోగమను తంత్రమే శరణ్యము. త్రివిక్రముడనగా మూడు స్థానములను దాటిన విరాట్పురుషుడు అతడు ఆదిపురుషుడు, ఆదిపురుషుడు. దేహమనుపురములో నివసించు ఏ చైతన్యము తన స్వప్రయత్నము చేత (విరాట్) మూడు స్థానములను దాటగలదో అది ఆధిపురుషుడగును. తన ఆదిని కనుగొన్నందున అది ఆదిపురుషుడగును. మూడింటిని దాటిన స్థితి పరమపదవి, శాంతిఅని వర్ణించబడినది.

ఇది ఇంత కావలసియున్నది. నాలోమీలో అందరిలో ఇది మనుష్యత్వమునకున్న సందేశము, లక్ష్యము మరియు గమ్యము.

## 31. భూతదయ, పశ్చాత్తాపము,సహోదర భావన ఉండనీ

## 32. భూత పూజ చేయవద్దండి.

## 33. మీ ధ్యాన, భోజనమందు, భూతదయ, పశ్చాత్తాప మును ఉంచుకోనండి, అంతయు శాంతిగా ఉండనీ మరియు నాలాగే తృప్తిపడనీ అని శాంతితో ఆ పరశ్రేష్ఠుని ధ్యానించండి.

మన దేహములో అనేక భూతములున్నవి. ఇక్కడ భూత మంటే భిన్న గుణసమ్మిశ్రణము మరియు భిన్న స్వభావము చేత సృష్టి అయిన ఒక వస్తువు లేక చేతన. అది స్థూలపు భౌతిక వస్తువయి ఉండవచ్చును లేక సూక్ష్మపు అంతరికశక్తి అయి ఉండవచ్చును. ఉదాహరణకు వాడుకగా పిలువబడు పంచభూతములు అయితే ప్రభువుల అభిప్రాయములో భూతములు నాలుగుగా ఉండి ఐదవది అయిన ఆకాశము తత్వమయి ఉన్నది వీటన్నిటి యొక్క మిశ్రమము చేత గుణములు మరియు కర్మముల విభాగముచేత (గీత యొక్క 4 అ 13 శ్లో చూడుడు) బ్రహ్మాండము యొక్క నిర్మాణమయినది అని శాస్త్రములో వర్ణించబడినది. బ్రహ్మాండము యొక్క పిండాండమైన మన దేహపు నిర్మాణము అదే రీతిగ అయినది.

పై చెప్పిన పంచభూతములను వదిలి మిగిలినవాటిలో కొన్ని భూత-ధాతు వర్గము లేవనగా : మన-ఇంద్రియమును కలుపుకొని ఏకాదశ ఇంద్రియములు, త్రిదోషములగు వాత-పిత్త-శ్లేష్మములు, త్రిగుణములగు సత్వ-రజస్సు-తమస్సులు, షడ్వర్గములయిన కామ-క్రోధ-లోభ-మోహ- మద-మాత్సర్యములు, సప్తధాతువులైన రస-రక్త-మేథస్సు-మాంస-మజ్జా-అస్థి-శుక్లములు, 49 ఉపవాయువులు, వాయువు యొక్క నాలుగు భాగములైన అపాన-ఉదాన-వ్యాన-సమానములు మొదలగునవి. ఈ అన్ని భూత-ధాతు-వర్గముల యొక్క సమగ్ర కార్యనిర్వహణ వలన మనుష్యుడు అత్యుత్తమమయిన దైహిక-మానసిక, ఆరోగ్యములతో ఉండుట సాధ్యము. యోగ సాధనలో ఈ భూతరాశిని 'ప్రసన్నము' చేసికొనప్పుడు మాత్రము తపస్సు సిద్ధిస్తుంది ఉపనిషదృషుల "ధాతుప్రసాద" గీతయొక్క "సర్వభూతహితేరతాః " ఈ విషయమునే తెలియజేయుచున్నవి.

భూతరాశిని నియంత్రించి ప్రసన్నము చేసికొనని పక్షంలో అవి అనియంత్రిత స్వేచ్ఛా జీవనపు క్రమశిక్షణా రాహిత్యమువలన పీడించుట మొదలు పెట్టును. దానిని 'భూతచేష్ట' అని అన్నారు. భూతచేష్ట నుండి మనము దాటుకొనవలయునంటే యోగమును యంత్రమును ధరించి ప్రాణపు మంత్రమును జపించవలెను. దానికి, అంటే యోగయంత్రము, ప్రాణమంత్రమును లోగొనిన బుద్ధియొక్క తంత్రమునకు ఎంతటి భూతమయినను లొంగిపోయి తన చేష్టను అంతమొందించును. యోగయంత్రమును పొందిన మనము భూత రాశికి వాటి ఉనికి యొక్క క్రమమములోనే వికాసమును ఇవ్వగలిగినట్లయితే అవి ప్రసన్నములయి అంటే సహజమయిన వికాసమును పొందినవై మనకు మనోతపోనానములో సహకరించే శక్తులుగా మార్పులు పొందును. ఎప్పుడు భూతరాశి సంపూర్ణముగా ప్రసన్నమయి మన మోహములో ఆకర్షితమై ఉండుటకు ఆరంభించునో అప్పుడు మనము భూతనాథులమైనట్లే ! ప్రభువుల సుందరవచనములో చెప్పవలెనంటే దేని దేనికి ఎంతెంత కావలసియున్నదో అంతంత పడవేస్తే అవి ఊరుకుంటవి.

భూతగణాది సేవితుడు, భూతనాథుడు అయిన శివుడు ఎల్లప్పుడు అంతర్ముఖుడై మహాతపస్సునందు నిమగ్నుడై యున్న కారణమున, చేష్టజేయు భూతగణపు నియంత్రణమునకు శివపుత్రుడగు వినాయకుని నియమించటమైనది. వినాయకుడు భూతగణపు అధిపతి. అదే రీతి, సర్వభూతములకు ప్రభువైన ఆత్మతనలో తానే రమించుచున్న కారణముచే భూతముల నియంత్రణమును బుద్ధికి అప్పజెప్పటమైనది. మనము భూతారాధకులము కాము భూతనాథుని ఆరాధకులము.

భూతరాశులు ఆత్మతో దేహయంత్రమునందు కూడుకొని నెలకొనియున్న కారణముచే అన్నియు సహోదరులుగా ఉన్నట్లే, అన్నిటికీ ఉదరము ఒకటే. (సహ+ ఉదర), అయితే నిజార్థపు సహూదరత్వము అక్కడ లేదు ఎందుకంటే ఆత్మ మరియు ప్రాణము జ్యేష్ఠము, శ్రేష్ఠము అయి ఉన్నవి.

తపస్సు యొక్క మూలము తాపమునందున్నది, తాపమంటే అగ్ని యొక్క సెగ (వేడి). వాయు-ప్రాణ-మనో మిలనము చేత గతాగతించెడి ఈ మూడు శక్తుల గర్జన వలన మెరుపు, మెరుపువలన ఊహాతీతశక్తిగల విద్యుత్ విద్యుత్ యొక్క అఘాతమునకు చిక్కిన దేహపుఅణువులు తమ స్వభావమునందు తామే తీవ్రగతితో చలించుట వలన వాటిలో సెగ ఉత్పన్నమై పూర్తి దేహము తాపమును పొందుతుంది. ఈ విధమైన తాపము రాను రాను అద్భుత పరిణామము చెంది, సంపూర్ణ దేహము ప్రజ్వలించుట మొదలుబెట్టినప్పుడు దేహపు కల్మషములు సంపూర్ణముగా నాశమగును. ఈ తాపమును దేహపు అణువులకు ప్రతి నిత్యము ఇచ్చియే తీరవలయును. అదే వాటి ఆహారము. యోగచిత్తముచేత పూర్తి దేహము తాపము పొంది నప్పుడు మాత్రమే ధ్యానము సాధ్యమౌతుంది. అలాగే తీసుకొను ఆహారము (చేసే భోజనము) దోషముకాకుండా భోజన మును దేహము తాపము పొందిన తరువాత (పశ్చాత్) చేయవలయును. అట్లగుటలో శాంతి కావలయును. భోజనము మనకు ఆకలిని ఎలా శాంతింపజేయగలదో, అదే రీతి తాపము అణువుల ఆకలిని పోగొట్టనీ అని పరశ్రేష్ఠుని గురించి ధ్యానించినచో, దాని యొక్క, అంటే తృప్తిపొందే అణువులచేత లోకశాంతి కొంతవర కైనను సాధ్యమౌతుంది.

## 34. కాషాయ వస్త్రములు ధరించవద్దు ఊరికనే ధరించి తిరుగువారికి గౌరవము (మన్నన) ఇవ్వవద్దు

మనకు బ్రహ్మత్వమును తెచ్చిఇచ్చు ప్రాణపు సంకేతమైన ఓంకారమునకు మూడుపాదములు లేక మాత్రలు-ఆకారము, ఉపకారము మరియు మకారము. అకార, ఉకారముల గతిలో ప్రాణము గర్జించు నప్పుడు రుద్రదేవుడై, రోదనము అంటే రో............అను ధ్వనిలో రోదించునప్పుడు కలిగే శబ్ద సంపత్తు చేత అగ్నియు, విద్యుత్తు ఉత్పన్నమగును. విద్యుత్ అతి తీక్షణమైనందున అది తక్షణమే దేహమునువ్యాపించి, ఆవిర్భవించి శాంతమగును. కాని అగ్ని దేవుడు అట్లు కాదు, అతడు మన అతిథి, ఆ కారణముచే కొంచెముసేపు ఉండి, ఆదరమును స్వీకరించి తరువాత వెళ్ళును. అతిథి, దేవుని మనము నిత్యమూ తృప్తిపరచవలసినదే. అందువలన మాత్రమే అతడు సంప్రీతుడై, మనము ఇచ్చు ఆతిధ్యపు వివరములను దేవతలకు తెలిపి, వారు మనకు శుభ మొనర్చుటకు ప్రేరేపించును.

రోదించు రుద్రదేవుడు శాంతపడి శివుడు కావలయును. లేని యెడల మన దేహజగత్తు రుద్ర మహారాయుని కోపాటోపమునకు చిక్కి మాడి పోతుంది ప్రాణపు రోదనము (భయంకర గర్జనము) రోదనము, (దుఃఖపు ఎడుపు) రుద్రదేవుని అనేక రకముల అభిషేకములతో, అంటే యోగమునందు ఉత్పన్న మగు అనేక రకముల రసములతో, తృప్తుడుగా చేసికొనవలయును. అట్లయినప్పుడు మాత్రమే రుద్రుడు శాంతపడి శివుడవుతాడు. ఇది ప్రతి నిత్యము జపమందు అగునట్టి, కావలసినట్టి, స్థితియొక్క ఒక దృశ్యము.

కావి రంగు, యోగాగ్నికి సంకేతము. జపమందు పుట్టిన యోగాగ్నిని ఓంకారపు మూడవ పాదమగు మకారమునందు శాంత పరుచుకొనవలయును. అంటే శబ్దగతిలో ప్రారంభమగు జపము శాంతిగతిలో పర్యవసానము పొందవలయును. శబ్దమునకు శాంతికి ఉండే కొలత ఏదంటే, పది నిముషముల శబ్దమునకు కనిష్ఠపక్షము 30 నిమిషముల శాంతిగతి. తరువాతి, రెండవ వరుసలో, ఐదు నిమిషముల శబ్దమునకు 30 నిమిషముల శాంతిగతి. రెండవ వరుస జపము యొక్క ఆరంభకాలమందు మాత్రము కావలసి ఉండవచ్చును. అటు తరువాత ఒకే వరుస యొక్క క్రమమనగా 10-15 నిమిషములకు దాటని శబ్దము యొక్క సందర్భములో కనిష్ఠ పక్షము రెండు గంటల శాంతిగతి కావలయును. శాంతిగతిలో ఎక్కువ సమయము కూర్చున్నచో తపస్సు పెరుగుటకు అనుకూల మౌతుంది. తపస్సులేనిచో యోగమేలేదు. తపస్సు శాంతిగతిలో మాత్రము సాధ్యమవుతుంది. ఈ కారణముచే శాంతిగతికి అతిగొప్ప స్థానమున్నది.

కావి వాడుకకు చెడ్డ సంప్రదాయమున్నది. చాలా కాలము క్రిందట, అంటే అనేక వేల సంవత్సరముల క్రిందట, కొంతమంది ఉద్ధతులు వైరాగ్యపు ఇచ్ఛ మొలకెత్తి ప్రయత్నించునప్పుడు సాఫల్యము కనబడకపోగా, బలప్రయోగము చేత దేహమును దండించుటకు మొదలుబెట్టినప్పుడు, ప్రాణపు గతాగతిని శరణుజొచ్చిరి. సదా ప్రజ్వల్వించు నిప్పుగానే ఉండగోరిన ఆ ధూర్తులు అదే రంగు బట్టనే ధరించుటకు ఎన్నుకొనిరి, కాలాంతరమందు ప్రాణపు సహజ గతి తప్పిపోయిననూ, వైరాగ్యపు చిహ్నమై నిలిచిన కావి వస్త్ర ధారణము మాత్రము విడువరైరి సహజమైన వైరాగ్యము - లేకున్ననూ సమాజము దానికి విలువను ఇచ్చినది అని తెలుసుకొనిన కపటులు దానిని దురపయోగపరుచుకొనిరి. ఆ దుష్ట సంప్రదాయమును ఈ నాటికి మనము చూచుచున్నాము.

అడవిలో సహజమైన తపస్సులో కాలము గడిపిన ఋషులు ఎల్లప్పుడు శుచిగా ఉంటూ ఉండిరి. వారు ఏనాడున్ను కావిబట్టలను కోరుకోలేదు. అయితే కొంతమంది బట్టలు, తపస్సు యొక్క కాఠిన్యత ద్వారా కందురంగు మారుచుండినవి. దానిని చూచిన కొంతమంది తపస్సు లేకపోయినను ఆ విధమయిన బట్టలను కట్టుకొనుటలో ఆశ్చర్యమేమున్నది? ఇంగ్లీషులో ఒక నానుడి యున్నది. "Theris no business like show business" అని. అదెంత సత్యమో!

## 35. ఏనాటికి ధర్మవిరుద్ధముగా ప్రవర్తించి కోర్టు వ్యవహారములకు పోగూడదు

మన దేహపు గణరాజ్యములో పెక్కుమంది ప్రజలున్నారు. (భూత-ధాతు వర్గములు). వాటిని నియంత్రించేటటువంటి సర్కారు లేక ప్రభుత్వమున్నది. అందరూ తమకున్న ధర్మమును బట్టి ప్రవర్తించినచో రాష్ట్రమునకు కళ్యాణమగును. కాని నేడు మనము చూచునదేమిటి? అందరూ ధర్మవిరుద్ధముగా ప్రవర్తించి పరస్పర దోషారోపణలో మునిగి, కోర్టు వ్యవహారములకై పోవుచున్నారు. ఇది శోచనీయము. మన - ఇంద్రియము స్వేచ్ఛాచారములో పడి పోయినది. అహంకారము దురహంకారి యైనది. చిత్తమను దీపము అరిపోయినది. అంగాంగములు తామే సర్వాధికారులమని అంటూ వర్తించుచున్నవి. కామమను అగ్ని రాజుకొని కాల్చుచున్నది. క్రోధము ఉధృతమయినది. మదము ఎక్కినది. మత్సరము మనలను బంధించినది. మోహమునకు మరులుగొన్న మనము మతి చెడగొట్టుకుంటిమి. మాయాపాశము బలవత్తరమైనది. వాయువు యొక్క బంట్లు కలుషితులై వాతావరణమును మలినము గావించినారు. సూర్యోదయపు సూచనయు లేదు. చంద్రుడికి సంపూర్ణగ్రహణము. ఇలా ఉన్న ఆపత్స్థితి యొక్క భీకరతనుండి మనలను రక్షించు వారెవరు? మనస్సు, బుద్ధి, ఆత్మ ఉన్నవి. ఆత్మ అధ్యక్షుడు. అయితే అతడు బహుదూరపు ఊరిలో ఉంటాడు. అతని దర్శనము సులభసాధ్యము కాదు. మనస్సు హైకోర్టు అయినచో బుద్ధి సుప్రీముకోర్టు. అయితే ఆ రెండు శక్తులకు వేరే ఎంతో కార్యబాహుళ్యమున్నది. ప్రజలు సర్వదా పరస్పర దోషాయసూయలలో నిమగ్నులయి ఉంటే, రాష్ట్రపు గతి ఏమవుతుంది ? వినాశనమే గతి. ఆ స్థితి

ఏర్పడినప్పుడు, పరులు ప్రవేశించి, వారి పరిపాలన ఏర్పడితుంది గదా

ప్రజలు ఇలా అవివేకులు కారాదు. అందరూ మనస్సును శరణు పొందవలయును - మానసం శరణం గచ్ఛామి. బుద్ధిని శరణు పొందవలయును - బుద్ధింశరణం గచ్ఛామి. ఆత్మను శరణు పొందవలయును - ఆత్మానాం శరణం గచ్ఛామి. వీటన్నిటికి ఆవలదియైన దైవమును శరణు పొందవలయును - దైవంశరణం గచ్ఛామి. దైవమునకు సేతువయిన ప్రాణమును శరణు పొందవలయను - ప్రాణం శరణం గచ్ఛామి. ఈ పంచీకరణమునకు మూలసూత్రము యోగమను తంత్రమయిన కారణముచే, యోగమును శరణు పొందవలయును - యోగం శరణం గచ్ఛామి.

యోగతంత్రముచేత దేహయంత్రమును సరిచేసుకొని, పంచీ కరణము యొక్క యజ్ఞములో నిమగ్న మగునప్పుడు వేదమంత్రము యొక్క శ్రవణ, దర్శన, ధ్యానములచేత ఋతమగు ధర్మమును తెలుసుకొని, ఆత్మ-స్వరాజ్యము యొక్క సామ్రాజ్యమును కట్టుకొని చ్యుతిలేక సర్వతంత్ర స్వతంత్రముగా జీవించి, దైవమునకు మనలను మనము అర్పించుకొన్నచో అక్కడికి మన సాధన యొక్క వికాసము పూర్ణమయినట్లే. అప్పుడు ముక్తి దొరకగలదా ? లేదనే చెప్పగోరుచున్నాము. ఎందుకంటే స్వర్గమును కనుగొన్న ధీర పురుషుడు జడముక్తికి లొంగక, జగత్తు యొక్క సేవకొరకు జనుల మధ్యకు మరలివచ్చి శ్రమించు యోగియగును. యోగిత్వము మనము పొందదగిన పరమస్థితి. అంటే, యోగి అర్థము శాంతి అని యున్నది. ఉపనిషత్తు యొక్క "ఆత్మక్రీడః, ఆత్మరతః క్రియావాన్ ఏషబ్రహ్మవిదాం వరిష్ఠః'' అనబడే స్థితి, నైజరూపములో, యోగిత్వపు స్థితికంటే భిన్నము, గౌణము అనియే చెప్పవలసియున్నది.

## 36. మరియొకరి తప్పును ఎంచి దూషించుట మహాపాపము

## 37. ఒకడు చెడు చేసినచో దానికి బదులుగా చెడు చేయకండి

## 38. దుష్టుడే కావచ్చు, చెడ్డవాడే కావచ్చు, అటువంటి వారిని దూరముగా నుంచరాదు. వారిని కూడా మంచిమార్గమునకు తీసుకురావలయును.

మానవుని దేహయంత్రము వివిధ రకముల భూత- ధాతువర్గముల మిశ్రమ కూటమి అని వెనుక వివరించబడినదికదా! మన దేహము అనేక అంగముల సమర్పక సంయోజనచేతనయిన ఒక మహా యంత్రము. ప్రతి అంగమునకు విశిష్టమైనట్టి రీతి-నీతి ఉండి, దానికి అనుగుణముగానే అవి కార్యోన్ముఖములవుతుంటవి. కాని వస్తుస్థితి వేరేగానే ఉన్నది. మనయొక్క అయోగ, అనగా అయోగ్య, జీవన క్రమమువలన వ్యవస్థ తప్పి, హాహాకారము లేచినది. దుష్టనడవడిక కారణముగా సర్వాంగములు దుర్వ్యసనములలో పడినవి. మార్గము తప్పిన అందరిని దూషించి దూరము చేసుకొనక, వారిని మంచి మార్గమునకు తీసుకురావలయును.

ఉదాహరణకు, యోగపు జపమందు భ్రూమధ్యమున దృష్టి నిలుపుటకు ప్రయత్నించినప్పుడు, దుర్మార్గమునకు దిగిన కన్ను కష్టమునకు లోనై దృష్టి అసాధ్యమౌతుంది. దృష్టి కుదరనిచే జపము అసాధ్యమై సాధకులకు విసుగువస్తుంది. కళ్ళు మండుతాయి, ఒత్తిడికి లోనవుతాయి, నీరుకారుతాయి, మసకబారుతాయి సాధారణముగా ఈ అన్ని దోషములు జపమునందు సరికావలసియేయున్నది. అయితే అనేకులకు కంటిబాధ కొన్ని సంవత్సరముల వరకు ఉండగలదు. దీనికి కారణము కన్ను యొక్క దోషపూరిత జీవనము.ఆసనమునందు కూర్చొని జపించునప్పుడు కాలు అధికముగా నొప్పి

పెడుతుంది. దీనివలన అనేకులు కొన్ని నిమిషముల జపమునకే విసిగిపోతారు. అదేరీతి, అనేకులకు గురుస్థానము దొరకనే దొరకదు. దొరికినా నిత్య జపములో చంచలత వలన స్థానము తప్పుతుంది. మన - ఇంద్రియము ప్రాణముతో ఏకీభవించక చింతన - మథనలయందే కాలము గడుపుతుంది. వాయు బంధనము (ప్రాణబంధనము కాదు. ఎందుకంటే అది కానే కాకూడదు !) సాధ్యముకాక అపానవాయువు తన ఒత్తిడిని చేస్తూనే ఉంటుంది. వీపు వంగి ఉంటుంది. ముద్ర తప్పుతుంది. నిద్ర వస్తుంటుంది. ఎన్నో మారులు వీర్యస్రావము కావటమూ కూడా కలదు.

ఈ అన్ని దుఃస్థితులకు బెదిరిన వ్యక్తికి తనమీద తనకే జుగుప్స కలుగుతుంది. తనను తానే శపించుకుంటాడు. అయితే ఫలమేమి? ఇచ్చట హఠము-కఠము కూడదు. దేహదండనము ప్రాణహింస, అంగభంగము కేవలము పైశాచిక వృత్తి. దారితప్పిన వాటినన్నిటిని కాలక్రమేణ, ప్రయత్నముచేత మచ్చిక చేసుకొన వలయును. ప్రయత్నముచేత మాత్రము యోగసిద్ధి సాధ్యము అని గీత కూడా చాటుచున్నది.

"ప్రయత్నాద్యతమానస్తు యోగీసంశుద్ధ కిల్బిషః।
అనేక జన్మసంసిద్ధి స్తతోయాతి పరాంగతిమ్॥'' (6-45)

పీడించే అవయములను దండించు పట్టుదలవలన హఠయోగము అను అవైజ్ఞానిక పద్దతి వాడుకలోనికి వచ్చినది. అది మహాపపము. ఎవరూ దానిని చేయరాదు. ప్రభువుల ఒక హెచ్చరిక ఇలా ఉన్నది.

"మరొకదాని, మరియు మరొకరి, తప్పును ఎంచి దూషించుట తప్పు, అటువంటివారు నానుండి దూరముగా ఉందురుగాక. ఎవడు తన తప్పును గుర్తించి దానిని దిద్దుకొనునో, అతనినే నేను ప్రేమింతును. తత్త్వము, ధర్మము తెలిసికొనవలెనంటే తన తప్పును దిద్దుకొని, సర్వము నావంటిదే అను దయతో సాగుచూ, అధర్మము, అన్యాయము, అనాచారములను దూరీకరించి ఉండువాడే నావాడు. అడవిలోని దుష్టవ్యాఘ్రమును తీసికొనివచ్చి, సాకి, సాధువుగా చేయవచ్చును, మరియొకరి తప్పును ఎంచి దూషించువారిని సరిచేయుట కష్టము. ఎందుకంటే వారు సదా అన్యుల దూషణ-భూషణలతోనే తృప్తిపడుచుంటారు. నీయొక్క ఆచారము, విచారము, నడత, మాట అంతయూ సరిగ ఉండనీ, అప్పుడు నాలో నీకు స్థాన మిచ్చెదను.''

## 39. చెప్పిన మాటలకు విలువ నివ్వవద్దు. ప్రత్యక్షముగా చూచి పరిశీలించండి.

## 40. తెలుసుకొని చూడండి

## 41. తత్త్వమున్నది. ధర్మము చూడండి

అది ఉన్నది. అది అదే. కాని అదే ఇదికాక ఇది దానినుండి అయినది, అది దీనిని ఎలా ఆడిస్తుందోయని చూడండి. దానిని ప్రత్యక్షముగా అనుభవమునకు తెచ్చుకొనండి. వేరే మాట వద్దు. వేరేవాళ్ళ మాట వద్దు. ఇది వేదము. ఇదింతే వేదము. ప్రభువుల ఈ తాత్త్విక నిర్ణయమును ఇంకా కొంచెము సులభం చేయవలెనంటే, తత్త్వమనగా అది. అది అంటే పరశ్రేష్ఠత్వము. దానియొక్క ఒక అంశమైన దేవత్వ అథవా దైవత్వ పరశ్రేష్ఠము యొక్క వ్యక్త ప్రతినిధి. దైవమునుండి బ్రహ్మాండము, దాని లోపల చిక్కిన జీవ-జడరాశులు సృష్టించబడినవి. దైవమునుండి బ్రహ్మాండము వచ్చిననూ, బ్రహ్మాండమే

దైవము కాదు. దైవము సృష్టింపబడిన సర్వమును, ఒక విశిష్ట రీతిలో ఆడించుచున్నది. దానిని ప్రత్యక్ష ముగా అనుభవమునకు తెచ్చుకొనవలయును.

బ్రహ్మాండమును నేరుగా తెలుసుకొనుట కష్టసాధ్యమైనందున, దానిని దాని ప్రతినిధియగు పిండాండము వలన తెలుసుకొనుట సాధ్యమై యున్నది పిండాండమనగా మనుష్యుడు. మనుష్యుని నిర్మాణమూ, బ్రహ్మాండపు నిర్మాణమూ ఒకే సూత్రపు ఆధారముపై నున్నందున, ఆ సూత్రమును పట్టుకొని సాగినప్పుడు ఇదియు, అదియు తెలుస్తుంది.

ఇప్పటికే విశదపరిచినట్లు, మనుష్య జీవనము యొక్క రెండు విధములైన ఇంద్రియ మరియు నిరీంద్రియ సంపత్తు యొక్క ఏర్పాటును యోగసాధనము ద్వారా మాత్రమే తెలుసుకొనవలసి యున్నందున తత్త్వపు తాళముచెవి యోగమునందున్నది. యోగమను తాళపు చెవి ద్వారా తత్త్వమను రహస్యమును తెలుసుకొన వలసి యున్నది.

నిరీంద్రియమని పిలువబడు దైవీ సంపత్తు యొక్క ఏర్పాటును మరియు దాని గతిని ధర్మము అందురు. దైవీవ్యవస్థ, పరశ్రేష్ఠత్వము యొక్క ప్రతినిధియై యున్నది. దాని ధర్మమును చూడండి. అంటే అనుభవమునకు తెచ్చుకొనండి అని ప్రభువుల సవాలు "సత్యం వద, ధర్మం చర'' అను వాక్యము ఇదే అర్థమును సూచించుచున్నది. తత్త్వము అనగా అది, అనగా శాశ్వతమైన సత్యము. పరశ్రేష్ఠత్వమే శ్రేష్ఠమూ, శాశ్వతమూ అయిన సత్యము. అదే ఇది. దాని ఆచరణయే ధర్మమై యున్నది. దానిలో, అనగా ధర్మములో చరించవలయును.

చరించుటకు రెండు అంతస్థులున్నవి. క్రింది అంతస్థును బ్రహ్మమనియు, పై అంతస్తును దైవీ చర్యమనియూ నిర్దేశించుకొన వలయును. బ్రహ్మచర్యమనగా బ్రహ్మేంద్రియము యొక్క ఏకైక స్థానమైన బ్రహ్మరంధ్రమునందు చరించుట, అనగా, చరించు సర్వశక్తులను యోగము ద్వారా ఒకటిగాజేసి, పైన స్థాపించుకొనుట. దానిని చేయువారందరు బ్రహ్మచర్యమునందుండువారు అని అర్థము. శ్రీకృష్ణుడు నేను శుద్ధ బ్రహ్మచారిని అని అన్నమాటను ఎగతాళి చేయువారు ఎంతమందో ? కాని నిజమును తెలిసిన వారెంతమంది? బ్రహ్మేంద్రియము యొక్క ఏకైక స్థానమందు చరించునట్టి యోగ సాధకులందరకును సంసారమందు ఉన్నను, వారికి దాని దోషముండదు. అయితే ఇక్కడ ఒక హెచ్చరిక ఉన్నది. సాధకు లందరుకు ఇది సామాన్యముగా సాధ్యము కావలెనంటే, పెక్కు సంవత్సరముల కఠిన పరిశ్రమ అవసరము. కావున దీనిని చదువు సాధకులందరు, మనమూ బ్రహ్మచారులమే అని అనుకొంటే, అభాస మవుతుంది.

ఇక దైవీచర్యమనెడి పై అంతస్తు యొక్క అనుభవము బహుశః కొంతమంది ఋషులకు మాత్రము సాధ్యమగునటువంటి దైనందున, ఋషి వర్గముకంటే పైనుండే యోగిత్వమునకే అది పరిమితము. ఆ స్థితియందు వారు దైవపు ప్రతినిధులై, దైవకార్యమును సమగ్రముగా సాగించగల జ్ఞానమును, ధర్మమును, శక్తిని పొందినవారై యుందురు. వారు దైవసాన్నిధ్యమును పొందిన వారైననూ, వారే దైవము కాదు. దేవుడు కాదు.

ఒకసారి ప్రభువులు ఉచ్చరించిన తత్త్వము ఈ రీతిగా నున్నది. "నేను కృష్ణునికి అతిసమీపమునకు పోయెదను, నేనే అతడు, అతడే నేను అనేటంతటి సన్ని హితత్వము నాలో ఉన్ననూ, నేను కేవలము యోగిని, అతడు యోగీశ్వరుడు.'' దైవపు ప్రతినిధియై నిలిచియున్న శ్రీ యోగి అచ్యుతులను మనము ప్రభువులని సంబోధించుటలో ఔచిత్యమేమిటంటే, వారు దైవీ చర్యమునందు సదా ఉంటూ సర్వాధికారమును పొంది, కర్మపు ఆచారణమునందు అప్రమత్తులై యుండుధీరపురుషులు. ఒక యోగికి దైవమునకూ ఉండు దగ్గరి సంబంధమును వారు ఆ రీతిగా బోధించినారు. అలాగే జీవించి చూపించుచున్నారు.

దైవత్వము యొక్క చిహ్నము శాంతి, పరమశాంతి. దైవత్వమునకు ప్రతినిధియైన యోగి సహజముగా చెప్పునట్టి మాట ఏదంటే "శాంతి నా దైవము",

విడమరచిన తత్త్వమును ఏకీభవింపజేసి చెప్పవలయునంటే :-

"తత్త్వమున్నది. ధర్మమును చూడండి. దైవమును భరించుకుంటూ శాంతిని పొందండి" అనగా "సత్యం వద, ధర్మం చర, దైవంభర, శాంతింకర".

## 42. ఎవరినైనా నమ్ము. కానీ నస నసగా మాట్లాడే వాళ్ళను మాత్రమే నమ్మవద్దు

మనకు బ్రహ్మత్వమును తెచ్చి ఇచ్చే ప్రాణ సంకేతమైన ఓంకారమునకు మూడు పాదములని వెనుక (34వ సూత్రమును చూడండి) చెప్పితిమి. అవి ఏవనగా, అకారము, ఉకారము మరియు మకారము. ఈ పాదములకు మాత్రలు అను పరిపాటియు ఉన్నది. మూడు పాదములకు మూడు గతులున్నవి. వాటిని వరుసగా దీర్ఘగతి, మధ్యగతి, శాంతిగతి, లేక రుద్రగతి, విష్ణుగతి, బ్రహ్మగతి, లేక ఋక్, యజుక్, సామ మొదలగునవి పేర్లు ఉన్నవి.

అకారము యొక్క దీర్ఘగతిలో ప్రాణము గర్జిస్తూ చరించు నప్పుడు రుద్రదేవుడై "రో" యని రోదించునప్పుడు ఏర్పడే శబ్ద సంపత్తుచేత విద్యుత్తు మరియు అగ్ని ఉత్పన్నమగును. తరువాత ఉకారము యొక్క మధ్యగతిలో దీర్ఘగతి క్లుప్తము, తీవ్రము కావలయును. ఆ గతియందు విద్యుత్తు మరియు అగ్ని యొక్క తీవ్రత హెచ్చుయి, అవి దేహాద్యంతము ప్రసరించును. చివరి శాంతి గతిలో మొత్తము దేహము మరియు దేహాంతర్గత సకల చేతనా సమూహము మేలుకొని ఏకీభావములో ఒక్కటై కూడుకొనుటలో శ్రమించునప్పుడు ధ్యానస్థితి లభించి తపస్సు సాధ్యము కాగలదు. అట్లగు వరకు శాంతిగతిలో దీర్ఘకాలమువరకు కూర్చొనవలసియే ఉన్నది.

అకార, ఉకారముల దీర్ఘ మరియు మధ్యగతియందలి ప్రాణము యొక్క ఆయామమునకు పది నిమిషములు సరిపోతుందనుకుంటే, శాంతిగతికి కనీస పక్షము ముప్పది నిమిషములు కావలయును. ఇది యోగము క్రొత్తగా ప్రారంభించిన సాధకుల కొరకు. కాని అనుభవజ్ఞులకు ఉన్న నియమమేమిటంటే, పదినుండి పదునైదు నిమిషము లకు దాటని శబ్దగతికి రెండు గంటలకు తక్కువ కానంతటి శాంతిగతి. ఇది ప్రభువులు నిర్దేశించి ఇచ్చిన యోగపు క్రమము.

అయితే కొందరు పొరపాటుగా తెలుసుకొని, దీర్ఘగతికి హెచ్చు మహత్వమునిచ్చి, ఆ గతిలోనే మొత్తము యోగాభ్యాసమును క్లుప్తపరచుకొంటారు. అట్టివారికి కేవలము శబ్దగతే యోగమనెడి భావన ఉన్నది. అయితే దాని నైజము అలా లేదు. ఉగ్రుడైన రుద్రదేవుని అభిషేకముచేత శాంతపరుచుకోనట్లయితే, ఆ మహానుభావుడు పీడించుతాడు. అభిషేకపు సామగ్రి మకారము యొక్క శాంతిగతిలో మాత్రమే దొరకగలదు. రుద్రదేవుని భక్తులలో కోపము హెచ్చుగా ఉంటుంది. రుద్రుడు తామసాభిమాన దేవత. తామసముతో పాటు రాజసముచేరుకొనినది. కావున యోగములో సాత్వికపు శాంతిగతి అత్యధిక మహత్వమున్నది. శ్రీకృష్ణుడు గీతలో (10-22) "వేదానాం సామవేదో స్మి" అని అన్నారు. అంటే "నేను వేదము లందు సామమును" శాంతి -గతికి సామమనెడి పేరున్నది - అని పైన చెప్పబడినది.

తమస్సు యొక్క ఆదినుండి ప్రారంభమగు గతి రాజసపు మధ్యమును దాటుకొని సాత్వికపు అంతమునకు వచ్చుటలో యోగపు ఒక మెట్టును దాటినట్లే. ఓంకారమునకు మూడు పాదములున్నవని సాధకులు మరువరాదు. కేవలము అకారముగాని, ఉకారముగాని, లేక ఆ రెంటి యొక్క సంధిచేతగాని ఓంకారము కాజాలాదు. ఓం కారమునకు మకారము

యొక్క శాంతిగతి అత్యవసరము. ఏ ఒక్క పాదము లోపించినను, తత్త్వాభాసమవుతుంది.

మరి కొంతమంది వ్యక్తులు ఆది, అంతములపై లక్ష్యముంచక, కేవలము మధ్య శబ్దములోనే పూర్తి జపమును ముగించుతారు. అంటే షుమారు ముప్పది నిమిషములు పర, పర అని, దూలమును కోసే పొడుగాటి రంపపు శబ్దమువలె, శబ్దము చేస్తారు. ఇదియు ఒకరకమైన ఆబాసము. అట్టివారి మనస్తత్వము వికసించక, వారిలో వితండవాదము వచ్చి చేరుతుంది. అట్టివారికి సామాజిక దృష్టి తగ్గి, స్వార్థపరత్వము, అధికార మోహము హెచ్చువుతుంది. దాని మోహములో పడ్డవారు అడ్డ-దిడ్డ దారులను వాడుకొని తమ మనోభీష్టమును నెరవేర్చుకొనగోరుతారు.

మూడు గతులలో సాగవలసియున్న యోగపు క్రమమునకు ఏదైనా అపవాదముండునా? అని విచారించవచ్చును. ఔను, ఉంది. జపము యొక్క క్రమమును కొన్ని విశేష సందర్భములలో మార్చుటకు ఆశ్రమ గురువులకు హక్కు ఉంటుంది. ఉదాహరణకు కొంతమంది సాధకులు సాధనయందున్నప్పుడు పలు విధముల రోగబాధలను అనుభవించు సమయములో శబ్దగతిని క్లుప్తపరుచుకొని మధ్యగతిని హెచ్చు చేయవచ్చును. లేదా సాధకుల మన స్థితిలో వ్యత్యాసమేర్పడినప్పుడు, శబ్దపు దీర్ఘగతిని హెచ్చు చేయమని చెప్పవచ్చును.

అయితే క్రమపు వ్యత్యాసమునకు దైహిక, మానసిక రోగ బాధలు, వాటియొక్క ఉద్ధృతావస్థలే కారణము కావాలిగాని, వేరే ఏదియు కాజాలదు. ఒక సమర్థుడైన గురువు, శిష్యునికి మేలు కలుగ వలెనంటే దీర్ఘ గతి యొక్క ఆవశ్యకత హెచ్చుగా నున్నది అని తెలుసుకొన్నప్పుడు, అట్టి శిష్యుని ఆ విశేష క్రమములో నుంచవచ్చును. అయితే ఆ క్రమమును అందరూ అనుసరించబోతే పరిస్థితి గంభీరము కావచ్చును.

ఒకసారి ఒక శిష్యుడు ప్రభువులను శబ్దగతిని గురించి అడిగినప్పుడు వారు "శబ్దము పదినిమిషములు చాలును'' అన్నారు. దానికి అతడు "స్వామీ ! పది నిమిషములు శబ్దము చేసినచో జపమును చేసినట్లే కాదు'' అని అనగా, ప్రభువులు "నీలో భీముడంతటి బలముంటే ఎక్కువ చేయవచ్చును. కాని ఇది కలికాలము. సంసారపు కలుషిత వాతావరణములో జీవించువారికి ఎక్కువ శబ్దగతి వలన ఎక్కువ కష్టమవుతుంది. కావున పది నిమిషములే చాలును. పది నిమిషముల శబ్దము వలన దేనినైనను పొందవచ్చును'' అని సెలవిచ్చిరి.

## 43. ప్రయత్నమే సాధకుని పుణ్యము

## 44. సమాధియను మైకములో పడకండి

## 45. మోక్షపు మాటెందుకు?

## 46. క్షణపు సహస్రాంశమునందలి మరపు, బ్రహ్మత్వమునకు బహుదూరము చేస్తుంది.

మానవ జీవనము యొక్క లక్ష్యము సమాధిస్థితి పొందుట అనునది కొంతమంది వాదమైతే, మోక్షమును పొందుటయే అనునది మిగిలిన వారి వాదము. అష్టాంగయోగములో సమాధి చివరిదియని చెప్పగా, పురుషార్థములలో మోక్షమే ఆఖరుదియని ప్రతిపాదించబడినది.

ఇది తత్త్వాభ్యాసుల మాటకాక తత్త్వాభాసుల మాటయైయున్నది. అనుభవజ్ఞులు అట్లని ఎప్పుడూ చెప్పలేదు. సమాధి యనబడు స్థితి యోగసాధనలో వచ్చి చేకూరు ఒక విధమైన మైకము. దానికి మోసపోతే ఎలా? బ్రహ్మత్వము పొందవలసిన సాధకుడు తన సాధనను, అప్రమత్తుడై, అంటే సదా జాగరూకుడుగా ఉండి, ఆంతర్యపు మనోభూమికయందు మార్పులను, అతి సూక్ష్మముగా గమనించివలసి యున్నప్పుడు సమాధియందు మైకము ఆవరించటమంటే అక్కడ మాయ ప్రవేశించినట్లే. అది ఆత్మయొక్క ఓటమి.

మోక్షపు అర్థము దేవుడిలో ఐక్యమగుట అని భావించినచో, అది అసత్యము. ఆ విధముగ తలచిన అది అవైజ్ఞానికము అని అనవలసియున్నది. ఎందుకంటే మానవ జన్మవచ్చినదే కర్తవ్యము కొరకు. కర్మ దక్షతవలన కర్మకు అధికారమును పొంది, తపస్సు చేత తన ఆంతర్యమును శుద్ధిచేసికొని, తన స్వరూప దర్శనమును చేసుకొని, దైవకృపచేత జగత్-సేవచేసి కృతార్థుడు కావలసినజీవికి మోక్షపు ఓటమి ఎందుకు? మోక్షమనగా ఓడినవారి స్థానము. ఆత్మ శ్రీమత్త్వమును పొందిన ఏ పురుషుడూ దానిని కోరజాలడు.

మనది కర్మభూమి. ఇక్కడ కర్మకు ప్రాధాన్యము. కర్మ దక్షతచేత కర్మకు అధికారమును పొందుటకు యోగవిజ్ఞానము కాక వేరే ఏ మార్గము ద్వారా సాధ్యముకాదు. కావున అందరూ యోగమును శరణు పొందవలయును. యోగముచేత మొదటదేహయంత్రమును భద్రపరుచుకొనవలయును. ఎందుకంటే సాధన కేవలము ఒకే సంవత్సరము లేక ఒకే జన్మమునకు ముగియునట్టి పిల్లల ఆటకాదు. కర్తవ్య పూర్తికి అనేక జన్మలు కావలసియుండునని శ్రీకృష్ణుడే చెప్పినాడు. కావున మానవ జీవితమును పరిపూర్ణతకు తీసికొనిపోవు బృహత్-యానమునకు ధృడమైన దేహయంత్రము కావలయును. దేహయంత్రము లోపల అణగియున్న సకల సంపదను దాని దాని స్వర్గస్థితిలోనే వికాసపరచుకొని, సర్వమును సఫలము జేసుకొనుటకై సాగుటయందు ప్రయత్నము జేయవలయును. అది సాధనా జీవనముఅది కావలసియున్నప్పుడు సమాధి, మోక్షము మొదలగు వాటికై పరితపించుటవలన మనోవ్యాధి వస్తుందేకాని మోక్షము రాదు.

ఈ లోపల సాధన, అనేక విఘ్నములను దాటవలసియున్నది. కావున అతనిలో ఆత్మవిశ్వాసము, సతత ప్రయత్నము, సాధనా ప్రేమ, దైవభక్తి, జాగరూకత, ధృడత్వము కావలయును. సంక్రమించు విఘ్నములను బుద్ధి కుశలతతో నివారించుకొనుటలో మనము విఘ్నేశ్వరులము కావలయును, జీవియొక్క అపూర్ణతకు ప్రయత్నము చేతనే ముక్తి. "ప్రయత్నాద్యత మానస్తు'' అను మాట గుర్తుండనీ.

## 47. బెదిరే కుక్కను చూస్తే తరుముకొని వచ్చే కుక్క మరింత జోరుగా వస్తుంది

శ్రీకృష్ణుడు దేనిని "హృదయ దౌర్బల్యము'' (గీత - 2-3) అని అన్నాడో దానిని ప్రభువులు మనోదౌర్బల్యము అని అంటారు. దుర్బలమైన మనస్సు భయపడి పరిగెత్తే కుక్క లాంటిది. బెదిరి పారిపోవు దుర్బల మనస్సును తరుముకొనివచ్చు కుక్కలేవంటే ఇంద్రియముల సమూహము మరియు వాటి విషయములు. సాధనా విహీన జీవనము వలన క్లైబ్యము, నిర్వీర్యము పొందిన మనస్సు దీనతకు లోనైనప్పుడు ఇంద్రియముల బలము హెచ్చినట్లయి, వాటి పీడ హెచ్చవుతుంది. భయము హెచ్చయిన కొద్దీ, వాటి దుర్నడత హెచ్చు అగుట వలన, మనస్సు ఒక ధృఢత్వమునకు వచ్చి ఒకసారి గర్జించి తరముకొని వచ్చు కుక్కను ధైర్యముతో పారద్రోలవలసి యున్నది. మనస్సును సానబెట్టునది తపస్సయినందున, తపస్సుతో గూడిన ఆంతరిక జీవనమునే శరణు పొందవలయును.

## 48. ఆత్మవిశ్వాసమున్నంతవరకు భయములేదు

కేవలము ఒక యోగినుండి మాత్రము రాగల ఈ సుందర సూత్రము ప్రభువుల జ్ఞానపూర్ణతను ప్రతిబింబించుచున్నది. ఇక్కడ యోగి యొక్క లక్షణమును సంక్షేపముగా (సూక్ష్మముగా) చెప్పవచ్చును. ఎవరు యోగపూర్ణులో, వారే యోగులు. అట్టి యోగులలో జ్ఞానపూర్ణతయున్ను, కర్మపూర్ణతయున్ను, సృష్టిస్వామ్యమున్ను ఉంటాయి. వారు దైవంభరులు, శాంతింకరులు అయియున్నను, తమ దైవత్వమును ఏనాటికీ ఉపయోగించజాలరు. ఏదేది సాధ్యమో దానిని మాత్రమే కేవలము ఆత్మవిశ్వాసముచేతనే నెరవేర్చుకోగలరు. ఆత్మవిశ్వాసము ఆత్మవిజ్ఞానము నుండి వచ్చు ఒకమహిమ. ఆత్మ ఆత్మ విజ్ఞానము యోగివిజ్ఞానము చేతనే - మనస్సులందు కూర్చుకొన వలసియున్నది.

యోగసాధనయందు, యోగిత్వము యొక్క మొదటిమెట్టైన ఆత్మను ప్రాణపు సహకారముతో హెచ్చరించుకొని, పురుషులై నిలువ వలయను. పురుషుడనగా పురమనబడు దేహమునందు నివసించువాడు. దానిని ఆత్మయనియు, బ్రహ్మమనియు పిలిచారు. ఆత్మను తెలుసుకొన్నచో మనము ఆత్మయే అగుదుము. అప్పుడు మిగులునది-ఆత్మ మరియు నేను అను ద్వంద్వముకాదు. మిగులునది ఆత్మయయిన నేనే. నేను ఆత్మ. ఇదయినప్పుడు నాలో నేను విశ్వాసముంచినట్టు ఇది మాటలతో అయ్యే పనికాదు."ఆత్మా ఏవ ఆత్మైవ భవతి" ఆత్మను తెలిసికొన్నప్పుడు మనము ఆత్మయే అగుదుము. అప్పుడు నేను నేనే అయి ఉంటాను.

'నేను'కు సదా మెలకువ ఉండాలి. ఎందుకంటే అది అతి శుద్ధమై యున్నందున దానికి మాయాకర్షణ యొక్క విఘ్నము జాస్తి. ఆత్మయందు మాయయను మఱపు, మైకము మోహము చేరుకున్నప్పుడు ఆత్మ ఘాతమై మనము విశ్వాసఘాతకులము అగుదుము. అది కాకుండా ఉండాలంటే సర్వదామెలకువ అత్యవసరము. మేలుకొన్న మెలకువలోనే మిగిలియున్న ఆత్మ ప్రజ్ఞానమయము, విజ్ఞానమయము, ఆనందమయము. అక్కడ ఓడిపోతే యోగభ్రష్టత కలుగుతుంది. తస్మాత్ జాగ్రత! జాగ్రత!! జాగ్రత!!!

## 49. సాధకునికి సంకల్పమెందుకు ?

## 50. చింతకు అంతులేదు

సృష్టికి ఒక నడవడిక ఉన్నది. దాని నుండి పుట్టివచ్చియున్న మనుష్యత్వమునకు మరియొక విధమైన నడవడిక యున్నది. మనుష్యత్వమును పొందిన మనసు మన నడవడికను సృష్టికి అనుగుణముగా సాగించినచో అది వైజ్ఞానికమనిపించుకొనగలదు. అయితే మన నడవడిక సృష్టియొక్క నడవడికకు ఎంతెంత వ్యతిరిక్తముగా ఉంటుందో, అంతంత కష్టములు మనకు రావటమేకాకుండా, చివరకు చావు అను ఆఘాతమునకు చిక్కి చనిపోవుదుము.

సృష్టి మరియు మన నడవడిక యొక్క గతిని తెలిసికొనుట కష్టసాధ్యము. అయినప్పటికీ యోగసాధన యొక్క సొగసునందు మన అంతర్యము శుద్ధమగుతూ పోయేకొద్దీ, మన విచికిత్సక బుద్ధి మేలుకొని, అంతర్దృష్టి దొరకునప్పుడు సర్వము స్పష్టముగా వేద్యమగును. వేద్యమగు అనుభవమును తెలుసుకొనుటలో ఒక విశిష్ట విధమైన కుశలత కావలయును. ఆ కుశలతను సిద్ధింపజేసికొని ధృడము చేసుకొనవలసి యున్నది.

ఇట్లు అగుటలో ప్రాణదేవుని కృపవలన ఆత్మసాక్షాత్కారమయి, బుద్ధి బలపడి, ఇచ్ఛా శక్తియైన మనస్సు ఆత్మశక్తితో

లీనమై యుంటుంది. ఆత్మశక్తికి చింతన - వంచనలు ఉండవు. అది మదము, మమకారము, మోహములనుండి దూరముగా ఉంటుంది. ఆత్మశక్తి, ఒక పాదముతో (అంశతో) సృష్టిని, మరియొక పాదముతో దైవమును, కౌగిలించుకొనియే, సాగుతుంది. దైవలీలగా సృష్టి సాగి పోతూ ఉన్నది. సృష్టికి ఉన్నది మనకూ ఉంటుంది. గనుక, మనము దైవమును శరణుజొచ్చి, అంటే దాని నడవడికను తెలుసుకొని, సాగినపుడు మన జీవితము వైజ్ఞానికమై ఉండి, ఏ ఆఘాతములకు బలి కాజాలదు.

సంకల్ప శక్తికి పెక్కు పొరలు ఉన్నవి. క్రిందిస్థాయిలో, దేహేంద్రియబద్ధ జీవనము సాగించినప్పుడు, సంకల్పశక్తి సంకల్పశక్తి మన- ఇంద్రియముయొక్క ఆశ, కోరిక, వాంఛ అని అనిపించుకుంటుంది. ఆ స్థాయిలో వ్యావహారికముగా వర్తించవలసిన మన-ఇంద్రియము యొక్క శక్తి తగ్గి అది తన ఆశ, కోరిక, వాంఛలను పూరించు కొనుటలో విఫలమవుతుంది. ఆశలు ఫలించనప్పుడు నిరాశ ఏర్పడుతుంది. నిరాశవలన చింత, చింతవలన ముదిమి. కావున చింతకు అంతులేదు. కోరిక హెచ్చేకొద్దీ ఫలించని నిరాశ, నిరాశవలన చింత, చింతకు అంతములేదు. అది అలా ఉండనీ. మన ఇంద్రియము యొక్క స్థాయిలో వచ్చు కలలు అస్పష్టములు, అర్థహీనములయి ఉండును.

సంకల్పము యొక్క రెండవ పొర అహంకారపు హఠముగా కనబడుతుంది. సాధకుడు సాధనలో సాగునప్పుడు కొంచెము అభివృద్ధి దొరికి, అతడి మన-ఇంద్రియము ఇంద్రియముల పట్టునుండి దాటుకొని, ఉత్తమతయందు నెలకొని నిలిచినప్పుడు అది మనస్సు అని పిలువబడుతుంది. అక్కడ శక్తి ఎక్కువగా ప్రోగయి ఉండి, నేను, నాకు అను అహంకారము కనబడుతుంది.

ఆ స్థాయిలో అహంకారమునకు రెండు ముఖములున్నవి. ఒక దానిని సాత్వికాహంకారమనియు, మరియొక దానిని రజస్తమోపేత దురహంకారమని అనవచ్చును. సాత్వికాహంకారము సాధకునికి ధృఢతను, విశ్వాసమును, ప్రేరణను ఇవ్వగలదు. సత్ప్రేరణచేత ఉత్సాహమును పొందిన సాధకుడు తన సాధనను తీవ్రము చేసుకొనుటకై శ్రమించి మధురాను భూతిని పొందును. యది అత్యవసర మైన ప్రయత్నము. అయితే దురహంకారమునకు బలియైన మనస్సు, దేనినో అతి తొందరగా సాధించుకొనవలయునను ఆతురతకులోనై, దొరకజాలని సిద్ధి కారణముగా కోపించి, పొందియే తీరవలయునను హఠప్రవృత్తిని వృద్ధిజేసుకుంటుంది. అది శోచనీయమైన స్థితి. కోపించిన మనస్సు ఎడమ దిక్కునందు సాగినచో వామాచారపు అడ్డదిడ్డ దారులకు దిగవచ్చును. కుడిదిక్కుకు తిరిగినచో అది మాయాపాశమువలన అమానుష కార్యము మొదలైన అద్భుతము లను చేయుటకు సిద్ధపడవచ్చును. ఇట్టి అవివేకపు ప్రవర్తన వలన సాధన నిలిచిపోయి, మనుష్యుడు పరమదుఃఖములోపడి మూలుగు తుంటాడు.

సంకల్పము యొక్క మూడవ పొరలో మనస్సు సాధనాబలము చేత, పైకి సాగి అతీంద్రియ సంపత్తు యొక్క సుఖముచేత మధురానుభూతిని పొంది 'మనా' అనిఅనిపించుకొని, బుద్ధియను వివేకశక్తిని పొందుతుంది. మనా, ప్రాణపు సఖ్యములో మధురానుభూతినిపొంది, బుద్ధియొక్క వివేకముచేత సృష్టియొక్క విజ్ఞానమును తెలుసుకొనుటకు మొదలు పెట్టినప్పుడు, జ్ఞానశక్తి ప్రబలమై, అంతయు తెలిసికొంటిని అను మౌఢ్యము వస్తుంది. అది బుద్ధియొక్క మౌఢ్యము. ఆ స్థాయి మనుష్యులనుండి వచ్చిన సాహిత్యము, ఇందు తత్వసాహిత్యమని పిలిపించుకొనుచు అయోమయములో పడవై చుచున్నది.

ఇదిలా ఎందుకంటే తత్వజ్ఞానము యొక్క మూలము బుద్ధి కాక ఆత్మయై యున్నది. ఆత్మయొక్క సఖ్యమును చేయని ఏ బుద్ధి మంతుడున్ను తత్వము తెలుసుకొనజాలనందున, వారి తత్వమునకు అనుభవపు ఆధారము లేక తర్కపు ఆధారము మాత్రము ఉంటుంది. తర్కపు తీక్షణతవలన వాద-వివాదములు, జయ-అపజయములు, భూషణ-దూషణలు, ఖండన-మండనములు సాధ్యమే తప్ప తత్వ నిర్ణయము కాదు. ''ఇదమిత్థం, ఇత మిత్థం'' అని చెప్పు

అధికారము ఆత్మను తెలిసిన తపస్వికి సాధ్యమవుతుందేకాని, బుద్ధివంత - తార్కిక మూర్ఖులకు కాదు.

సంకల్పము యొక్క నాలుగవ పొరలో సంకల్ప శక్తి ఆత్మ యొక్క మానససరోవరమందు ఉద్భవించు కుసుమమై, అది కర్మదక్షతగా మార్పుచెందుతుంది. ఆ స్థితిలో, ఆశ - ఆకాంక్షములుగాని, అహంకార - దురహంకరములుగానీ, బుద్ధి - తర్కములుగానీ, లేక, కేవలము శుద్ధమైన జాగ్రత (మెలుకువ), కర్తవ్య ప్రజ్ఞ, విశ్వప్రేమ, సేవాధర్మము, సంకల్పరాహిత్యము ఉంటుంది. అక్కడ సంకల్పము లేదు. ఎందుకంటే ఆత్మవిశ్వాత్మయైన దైవములో లీనమై దైవలీలతో గూడి ఆడుటకు కోరుతుంటుందే తప్ప తనదేయైన సంకల్పమును ఉంచుకొనదు.

దీని తాత్పర్యమేమిటంటే :- ఆత్మను తెలిసికొనని సాధకుడు సంకల్పము చేయరాదు. ఎందుకంటే అక్కడ అజ్ఞానముంటుంది. అజ్ఞానమువలన మన సంకల్పము సృష్టి నడవడికకు వ్యత్యాసము తేగలదు. కావున సంకల్పము పనికిరాదు. ఇంకా పై దశయందు, ఆత్మయే మనమయినప్పుడు సంకల్పము యొక్క ఆవశ్యకత ఉండదు. ఎందుకంటే అక్కడ జ్ఞానోదయమై ఉంటుంది గనుక మనము సృష్టి మరియు దైవపులీల కనుగుణముగా సాగుటలో సార్థక్యముపొందడమే తప్ప, "నా సంకల్పము" అనే ద్వైతము అక్కడ ఉండదు. అజ్ఞానము నందు అమానుష కార్యము మొదలగు అవైజ్ఞానిక ఆటపాటలను చేసే సాధ్యతగాని, హక్కుగాని ఎవరికి ఉండదు. సర్వతంత్ర స్వతంత్రుడగు యోగియు అమానుష కార్యము చేయజాలడు. ఎందుకంటే అతడు మహావిజ్ఞానియై యుంటాడు.

## 51. ధర్మమునకు రెండు చేతులు : ఒక చేతిలో దుడ్డుకర్ర, మరొక చేతిలో వెన్న

## 52. తప్పు చేయవద్దు, క్షమ కోరవద్దు

## 53. ధర్మము ఎక్కడికి వచ్చిందో చూడండి

## 54. ధర్మాభిమానులకు నేను చిర ఋణిని

## 55. ఏది దేని కొరకు, ఎక్కడనుండి, దేనిని మోసుకొని, దేనిని చేస్తూ సాగుతుందో అది, దానిని, దాని కొరకు మోసుకొని, దానినే చేస్తూ, ఆ వైపుకు సాగుతుంది.

దైవీశక్తి విశ్వముయొక్క సకల స్థూల-సూక్ష్మములను విశిష్ట గతియొక్క నడవడికలో నుంచినది. ఆ నడవడిక యొక్క వైజ్ఞానిక వ్యవస్థకు ధర్మము అని పేరు పెట్టబడినది. దానినే ఋతము, సత్యము అనియు పిలుచుచున్నారు. ధర్మపు నడవడిక గూఢమూ, అనంతము అయి ఉండి, అది అనంత రూపములలో ప్రవహించు చున్నది. విశ్వమునందు వచ్చియున్న సకల జీవ-జడ వర్గమునకు దాని దానికి అంటుకొనియున్న ధర్మమున్నది. ఆయా ధర్మమును వాటి స్వభావము అని అర్థము చేసికొనవలయును. వస్తువులను తెలుసుకొనుట విజ్ఞానమైనందున, దానిని యోగవిజ్ఞానము చేత తెలుసుకొనవలయునే తప్ప స్వభావమును మార్చుటకు రాదు.

ఒక ఉదాహరణము వలన మనము ధర్మపు వ్యాఖ్యను చేసి కొనవచ్చును. మనము ఉపయోగించు చేతి గడియారము షుమారు నూటముప్పది (130) విడిభాగములచేత తయారయిన వస్తువు. విడి భాగములను ప్రత్యేకించి ఒకొక్కదానినే పరిశీలించినప్పుడు అవి యన్నియూ ఒకదానికొకటి సంబంధములేనివిగా కనబడుతవి. ప్రతి భాగముయొక్క పుట్టుక, గుణవిశేషత వలన ఏర్పడిన దాని స్వభావము భిన్నముగా ఉంటుంది. అయితే ఆ అన్ని విభాగములను ఒక విశిష్టరీతి యొక్క ఏర్పాటులో అలవరచి, దాని స్థూలమునందు చాలనము ఇచ్చినప్పుడు, చేతిగడియారము తన 130 విడిభాగముల భిన్నమైన ఆస్తిత్వమును జీర్ణించుకొని, ఒక ఘటకమై తన కార్యమును ఆరంభించినప్పుడు అది పరమావధి ఆరోగ్యమునందున్న ఒక వస్తువు. 130 విడిభాగముల భిన్నతను లోగొన్న ఏ ఒక వ్యవస్థ అక్కడ ఉన్నదో దానిని దాని (గడియారపు) ధర్మము అందుము. అన్ని భాగములు సంతృప్తి కరముగా పనిచేయునప్పుడు అక్కడ ధర్మము నెలకొని యుంటుంది. కదాచిత్ (ఎప్పుడైనా) కేవలము ఒక భాగము తన ధర్మమునుండి చ్యుతి పొందినప్పుడు, పూర్తి చేతి గడియారపు వ్యవస్థ అస్తవ్యస్తమౌతుంది. అప్పుడు అక్కడ అధర్మము తలెత్తినట్లవుతుంది. ఆ అధర్మమును తక్షణము తీసివేసి, గ్లాని పొందిన ధర్మమును పునః సంస్థాపించవలయును (గీత 4-7,8) అది కావాలంటే చేతి గడియారపు ధర్మమును తెలిసిన ఒక వివేకిని రప్పించుకొని అధర్మమును తీసివేసి, దాని మూలధర్మమును దానికి పునః ప్రాప్తమగునట్లు చేయవలయును. అక్కడ ధర్మసంస్థాపన అమట్టమునకు - అయినట్లయినది.

పూర్తి విశ్వపు వ్యవస్థను ఈ రీతిగా తెలుసుకొంటే ధర్మ మనగా నేమి? అధర్మమనగా నేమి? ధర్మసంస్థాపనకు దేవుడు ప్రతి యుగమునందు అవతరించి వచ్చుట అనగానేమి, అనునది తెలుస్తుంది. ఈ తెలివికి (గుర్తుకు) అనుభవమే సాక్షిగా ఉండి, అనుభవమునకు యోగసాధనమే మూలసూత్రము.

ధర్మమునకు రెండు చేతులు. సకలముయొక్క వ్యవస్థ సంతృప్తి కరముగా నుండి ఆ నడవడిక పుణ్యాభాజనమయినప్పుడు, దైవమునకు అది సమర్పితమయినట్లే. దైవము దానికే సంతృప్తి పొందుతుంది. ఒక చెట్టుయొక్క ఉదాహణరమును తీసుకుంటే, అది ఎందుకు సృష్టించబడినది అనునది దానికి తెలియదు. కాని అది ప్రకృతి దత్త మైన పోషకాంశములను సహజముగనే దానిలో చేర్చుకొని పెరిగి పెద్దదై, పూవు, కాయ, పండును ధరించి విరిసి నిలిచినప్పుడు, అది తన సార్థక్యమును కనుగొన్నట్లయినది. పెరిగిన చెట్టు బాటసారులకు చల్లదనమునిస్తుంది, పక్షులకు ఆశ్రయమై వుంటుంది చుట్టూ ఉండే గాలిని శుద్ధి చేస్తుంది. పండువలన ఆనందమునిస్తుంది. చివరకు అది వయస్సు చేతపడి నాశమయిననూ, అక్కడ కూడా అది కట్టెలను ఇచ్చు పుణ్యాశాలియై యున్నది. ఇదంతయు దాని స్వభావము. ఇట్లే ప్రతి యొకదానికి ఒక వ్యవస్థ ఉంటుంది. ఆ దాని దాని సంతృప్తికర జీవనమే దాని దాని పుణ్యమై ఉంటుంది. ఆ ఆమట్టములో ధర్మము సంప్రీతిని పొంది దానిని తనది అని భావించుతుంది. అదే దాని మోక్షము. ఆ మోక్షము దాని జీవగతియందు తేలివచ్చినదే. కాని, బయటనుండి పొందినది కాదు. అట్లా పొందడానికి రాదు కూడా. సూక్ష్మముగా చెప్పినప్పుడు, వెన్న తేలివచ్చినట్లు మోక్షమను విడుదల ప్రతియొక్క జీవి - జడవర్గమునకు దాని దాని జీవనగతి యందు తేలివచ్చు సహజత్వమేగాని, దానికొక ప్రత్యేకమైన పరీక్ష, ఉత్తీర్ణత అనునది లేదు.

నిజస్థితి ఇలా ఉండగా భక్తి, భజన, పూజ, ధ్యానము మొదలైన అనర్థకారక కృత్రిమతలచేత దేవుని మెప్పించి మోక్షముపొంద వచ్చునను మాట అవైజ్ఞానికము, పైశాచికమూ అవుతుంది. కర్మ దక్షతవలన దాని దాని విడుదల ఉన్నదిగాని, కర్మసన్యాసము వలన గాదు.

అయితే అయోగస్థితిలో ధర్మము సంకరమైన అధర్మము తలెత్తినప్పుడు. దానిని సరిచేయుటకు దండనీతి యొక్క

సంహిత కావలసి ఉంటుంది. దండనీతి అంటే ఆ వ్యవస్థకు లోనైన ధర్మమును మరల స్థాపించు రీతి, దీనిని ఎవరూ కాదనలేరు కదా!

ధర్మమును వదలి నడచినప్పుడు వచ్చు అధర్మమును సరిచేసుకొనుట అంటే చేసిన తప్పును దిద్దుకున్నట్లే. దిద్దుకొనుటయే దాని శిక్ష. ఇక్కడ తప్పిపోయి వ్యవస్థను మరల సరిచేసుకున్నట్లు.

మన దేహము యొక్క ఉదాహరణమును తీసికొనండి. దేహమునకున్న ధర్మము తప్పిపోయినప్పుడు, అది రోగమును వ్యథలో పడుతుంది. దానివలన దుఃఖము వస్తుంది. వచ్చిన రోగమును చికిత్స చేత పోగొట్టుకొనుటయే మనము దానికి ఇచ్చు శిక్ష. అనారోగ్యమునకు ఆరోగ్యమే శిక్ష అజ్ఞానమునకు జ్ఞానమేశిక్ష మృత్యువుకు అమృతత్వమే శిక్ష అపూర్ణతకు పూర్ణత్వమే శిక్ష బంధమునకు మోక్షమే శిక్ష.

అయితే మనలో ధర్మము ఉన్నదా అని చూసినప్పుడు లేదు అనునది సుస్పష్టముగా కనపడుతుంది. అయోగజీవనమును అంటి పెట్టుకొనియున్న మనకు దుఃఖము, రోగము, ముదిమి, అజ్ఞానము, చావులే సత్యమయినవి. వాటిని దాటుకొని ధర్మస్థులమగుటకు మూల సూత్రమైన యోగము, తపస్సు, ఆనందము, పరశ్రేష్ఠత్వపు కృపను తెలుసుకొనక మూలుగు చున్నాము. బయటవైపు నుండి ఆంతర్యము వైపుకుపయనించు ధీరులు ఎంతమంది ఉన్నారు మనలో? బహుశా కొద్దిమంది మాత్రమే. అబ్బా! ధర్మము ఎక్కడికి వచ్చిందో చూడండి! అయినను కలిమలపు బాధలో కూడా ధర్మాభిమానము విడువని కొంతమంది ధీరవ్యక్తులు, సాంసారిక కష్ట కార్పణ్యములు ఎన్ని యున్నను, ఐదో పదో నిమిషముల అంతరిక తపస్సు, దాని ఆనందము, దైవపు కృపారక్షయందు సాగుతూ ఉన్నారో వారికి దైవము చిరఋణి ! యోగత్వము దైవత్వమునకు తీసికొనుపోవు దేవమార్గము కావున యోగ సాధకులు దైవత్వపు ప్రజలగుదురు, కావున అట్టివారి బాధ్యతను దైవమే వహించుతుంది.

## 56. స్థూలమునకు స్థూలము, సూక్ష్మమునకు సూక్ష్మము

## 57. శాంతి ప్రధానము, శాంతి ఆహార నిష్ఠ ముఖ్యము

## 58. మనుష్యత్వమునకు ముందు జాగ్రత్త అవసరము. మాయాపాశమువలన ముందు గాఢాంధకారమున్నది.

## 59. అందరూ పూరణత్వమునకే నిలిచినవారైనచో ధన్యులు

## 60. పూర్ణత్వమునకే జీవాత్మలు గుటుగుటుమంటున్నారు.

మన జీవనమునుకున్న రెండు సంపదలగు స్థూల-సూక్ష్మముల గురించియూ, వాటి వ్యవస్థను గురించియూ ఇంతకు ముందే వివరించ బడినది. స్థూలముగా నుండి, జీవితము సాగించుటకు కావలసిన అనేక విధములు అంగ - ఉపాంగములచేతనూ, ఇంద్రియములచేతనూ ఏర్పాటైయున్న మన సుందరమైన దేహమును స్థూలమనియు, దాని లోపల చిక్కుకొని వ్యవహరించుచున నిరీంద్రియ సంపత్తు అని పించుకొను వాయువు, ప్రానము, మనస్సు, దాని వేర్వేరు పొరలు,

చివరకు ఆత్మ అనబడు మన పురుషత్వమును లోగొన్నశక్తి కలయికకు సూక్ష్మమనియు  పిలుస్తూ, ఈ రెంటి యొక్క సమగ్ర జీవనగతిని సంసారమని తెలుసుకొనుట అయినది. మనుష్యుని వైవాహికపు స్థూలపు వ్యవహారమును జీవనము అనుకొనియున్న ఔచిత్యమును ఆధునిక మానవులు తమకు తామే ప్రశ్నించుకొనవలసి యున్నది. మన లోపల దాగియున్న అద్భుతమైన చేతనా కూటమును తెలిసికొనినచో, జీవనము అపూర్ణముగానే మిగలక మరేమవుతుంది?

మనుష్యత్వమునకు వివేకోదయము కానిచో, విఘ్నము లున్నవి. ప్రకృతి తన ప్రతి కృతియగు మనుష్యునిలోముందు జాగ్రత్తయను గుణవిశేషమును ఉంచియున్నది. దాని ఉపయోగము చేత మనుష్యత్వము ముందు జాగ్రత్త వహించి ఈనాటికుండు మాయాపాశమునుండి విడదలపొంది, ముందున్న గాఢాంధకారము నుండి దూరముండవలసియున్నది. తపస్సుచేత మన ఆంతర్యమును మనము శుద్ధిచేసికొని, చావుయనెడి గాఢాంధకారమును దూరముచేసుకొని అమృతత్వమనెడు శాశ్వతమైన జ్యోతి అడుగులలో జీవించు సాధ్యత ఉండగా, మనుష్యత్వమునకు మాయాపాశము ఎందుకుండ వలెను? చావు అనగా గాఢాంధకారము. దానికి కారణము అజాగ్రత్త, అజ్ఞానము, ఇంద్రియభోగము. చావును దాటుకొని దాని సంకెళ్ళనుండి తప్పుకొనుట తపస్సు సదా సిద్ధమై. సైయని నిలిచి యున్నది.

అంతర్యమును  కౌగిలించుకొని సాగవలసియున్న సూక్ష్మమైన తపస్సు స్థూలమును అంటుకొని సాగవలసియున్నది. మనకున్న స్థూల-సూక్ష్మములు పరస్పర పూరకములే కాని మారకములు కావు. ఈ రెండు స్థితులు దైవమను సద్వస్తువునుండి వచ్చినవి. అయినప్పటికి వాటి గతి-మితులలో భిన్నత్వమున్నది. సూక్ష్మమునకు పోల్చినచో స్థూలము గౌణముగా కనపడినను, బ్రహ్మశ్రీ విజయీంద్ర స్వాముల మాటలో చెప్పాలంటే “స్థూలపులోతే సూక్ష్మము” సూక్ష్మపు వ్యవస్థకు స్థూలపు రంగము తప్పక కావలసిఉన్నందున, ఒకదానికొకటి ఏదియూ గౌణము కాదు.

ఐతే ఆ రెంటికీవున్న భిన్నత్వమును తెలుసుకొనకపోతే మనము రెండింటికి అపచారము చేయుదుము, ఎందుకనగా దాని దాని స్వభావమునకు అనుసారముగా, వాటిని జీవింపజేసికొంటూ వికాసముచేసు కొనవలసియున్నది. సూక్ష్మపు వ్యక్తత, అంటే ప్రకటిత, స్థూలపు శుద్ధతను అనుసరించియే ఉంటుంది. కాన సూక్ష్మపు అత్యంతికను పొందగోరువారు స్థూలపు అత్యంతికి శుభ్రతకు, శుద్ధతకు గమనము ఇవ్వవలసినదే కదా !

ఇలా ఉండే సత్యమును మాయా పాశమువలన తెలుసుకొనక స్థూలమును గౌణము, బంధనకారి అనుట ఎంత క్షుద్రత ! స్థూలమును పూర్ణత్వమునకు తీసికొనిపోవునప్పుడు, అక్కడ మిగలునది స్థూల ము కాక అది కూడ సూక్ష్మమే అయివుంటుంది. స్థూల పూర్ణతచేత సూక్ష్మపు పూర్ణత,  ఈ రెంటి పూర్ణతను మానవ పూర్ణత్వమని స్వాములు నిర్దేశించినారు. ఈ రీతి మానవ పూర్ణత్వమునకు జీవాత్మలు, అర్థాత్ ప్రాణము మరియు ఆత్మ,  పరితపించుచున్నారు, కాని సాధ్యము కాక, గుటుగుటు మంటున్నారు.

పూరణము అంటే నిండుకొనుట అని అర్థము. కేవలము దైహికమైన సంసారమునందు ఉంటున్న మనము అంతర్యమును మేలుకొలుపు కొననందున, మన ఆంతర్యము ఖాళీగానే మిగిలి పోయినది. దేహము గుడియేమో ఉన్నది. అయితే దానికి శోభ, విలువ తెచ్చుదేవుడు లేడు.! (హంపిలోని విజయవిఠలునిదేవా)  లయములాగా! అయితే, సాంకేతిక మేమో అన్నట్లు, విజయ (బ్రహ్మశ్రీ విజయీంద్రస్వాములు) విఠలుని (ప్రభు శ్రీ అచ్యుతులు) హంపికి పిలుచుకొని రావడము ఎంత మార్మికము ! ప్రభువులు, స్వాములను గురించి “నిన్నే వెతుకుంటూ వచ్చాను. నన్నిక్కడ తెచ్చి వేశావు!” అని అన్నారు.

అందరూ పూరణత్వమునకు నిలువవలయును, అంటే అంతర్యములో ప్రాణవాయువును నింపుకొని శుద్ధముగా ఉంచుకొని, శుద్ధమైన దాని వలన, మన అంతర్యమునే శుద్ధము చేసుకొని, సర్వమును ధ్యానమూలకముగా తెలుసుకొని అపూర్ణతను పోగొట్టుకొని, మనుష్యత్వమును పొంది, దాని పూర్ణతను పొందినప్పుడు అక్కడ కర్మపు బందము వీడుతుంది. కానీ కర్మముచేత ముక్తి అనేది ఏది లేదు.

ఇంత కావలసి ఉనప్పుడు, సాధకులకు ప్రయత్నము, ధృడత్వము, నిష్ఠ, శాంతి అవసరము. విచిత్రమేమంటే, దానికి ఆహార నిష్ఠయే మూలము. ఇది ఎలా అంటే, మనము తినే స్థూలపు ఆహారము పచనమై, దానికి స్థూలాంశము దేహమునకు సూక్ష్మాంశము మనస్సును చేరుతుంది. మనస్సు యొక్క పెరుగుదలపైన మనము తినే ఆహారపు పరిణామము పడుతుంది గనుక, ఇక్కడ ఆహారనియమము ముఖ్యము.

ప్రభువులు దీనిని గురించి ఇలా వివరించుచున్నారు. "ఓం శాంతిః॥ శాంతికి తత్వమే కారణము. దేహారోగ్యమే భాగ్యము. దాని వలన మానసిక సుఖము. సుఖమే సంపద. దీని వలననే శాంతి దీనికంతకూ మూలాధారము తత్త్వము. అది కావడమంటే తన్ను తాను తెలుసుకొనుట దీని వలననే భక్తి."

ఆ తత్త్వమును తెలుసుకొనుటకు మొదలు స్థూల శుద్ధి కావలయును. సర్వదా ఉత్తమమైన ఆహారమునే సేవించవలయును. ఉప్పు, పులుసు, తీపి, కారము మొదలైన రసములను హెచ్చుగా సేవించినచో, ప్రతి యొకటి తన గుణము ననుసరించి, మనుష్యుని దేహమునకు, మనస్సుకూ వ్యత్యాసమును కలిగిస్తుంది. స్థూలము నందు గంజాయి, మాంసము, సారాయి, కల్లు, మొదలయిన వాటిని సేవించుటచే మనుష్యునికి దైహికము మరియు మానసికములగు పరిణామములు కనబడుతవి కదా ! ప్రతి యొక్క పదార్థపు సేవన చేత కూడా మనుష్యుని దేహము అట్లే మనస్సుమీద పరిణామము అయ్యే తీరుతుంది. కొన్ని పరిణామములు స్థూలములో వెంబడే కనబడతాయి. ఈ విషయమయి 'కాయకల్ప' గ్రంథమునందు వర్ణించి నట్లే ఉంటుంది.

"ఎందుకంటే స్థూలము ఏ రీతిలో పెంచబడుతుందో అదే రీతిలో మానసికమగు పెరుగుదలయూ అగుట సహజము. దేశపు వివిధ భాగములందున్న కొన్ని కుటుంబ గౌరవముల మనోధర్మము నందలి కలహప్రియత్వము, జిజ్ఞాసా బుద్ధి, శాంతి ప్రియత్వము, తత్వాకాంక్ష మొదలైన వాటిని గమనించినచో, దానికి వారి వారి ఆహారమే ముఖ్యకారణముగా నుండి అది క్రమేణా వృద్ధిబొందుచూ, వంశానుగతమై అదే మనోధర్మము, ఆహార సాంప్రదాయమూ పెరిగి బలముగా వేళ్ళూని నిలిచినదై యుంటుంది.

**61. ఎంత కష్టమొచ్చిననూ శాంతినుండి తొలగవద్దు. ఆలోచనచేసి కర్తవ్యమును చేయుటకు ప్రారంభించండి.**

**62. కర్తవ్యము చేయునప్పుడు చిరకాలము జీవించెదనని చేయుము. ధ్యానమునకు కూర్చున్నప్పుడు అదే ఆఖరుది అని భావించి కూర్చొనుము.**

**63. నిలుచుంటే నిట్టనిలువుగా మూడుగంటల కాలము నిలువుము. కూర్చుంటే**

**మూడుగంటల కాలము నిటారుగా కూర్చొనుము. చూస్తున్న చూపును మూడు గంటల కాలము మరల్చకుండా చూడగలిగితే దేనినైనా సరి గమనించవచ్చును, బాహ్యాంతరముల ఇతిమితుల సరిహద్దును కనుగొనవచ్చును.**

ప్రభుశ్రీ అచ్యుతుల బోధణా సారమును రెండు ముత్యముల లాంటి మాటలలో చెప్పవలెనంటే, కర్తవ్యము మరియు తపస్సు. ఈ రెంటిని ప్రతియొక్క మనుష్యుడు చేయనిదే గత్యంతరము లేదు. అని వారి నిర్ణయము. వారు ఇలా చెప్పుదురు.

"పగలు కర్తవ్యము కొఱకు, రాత్రి కఠిన తపశ్చర్య కొరకు"

దీనికంటే భిన్నమైన వేరొక రీతిని మానవతకు ఇవ్వనేలేదు, అని అంటారు. శ్రీకృష్ణుడు కూడా గీతలో (3-15) దీనినే చెప్పాడు.

"కర్మబ్రహ్మోద్భవం విద్ధి, బ్రహ్మాక్షర సముద్భవమ్ !

తస్మాత్ సర్వగతం బ్రహ్మ, నిత్యం యజ్ఞేం ప్రతిష్ఠితమ్ ॥

గీత యొక్క కర్మ ప్రభువుల కర్తవ్యమైతే, అక్కడి బ్రహ్మ ఇక్కడి తపస్సయినది. బ్రహ్మత్వమునిచ్చే తపస్సుకు అక్షరమైన ఓంకారమే మూలమైయుండి, ఆ ఓంకారము ప్రతి నిత్యమూ యజ్ఞమను తపస్సునందు ప్రతిష్ఠాపితమై యుండవలయును. తపస్సు నిత్యమూ అహర్నిశము చేయవలసిన సూక్ష్మకర్మ. ఈ సూక్ష్మకర్మ, స్థూలమును అంటుకొనియే సాగవలసినందున, స్థూలమునకూ అంతే మహత్వమును ఇవ్వవలసియున్నది. అదే రీతి స్థూలకర్మకు సూక్ష్మమమే ఆధారమయినందున సూక్ష్మమును వదలి స్థూలములేదు. ఇలా ఈ రెండు పరస్పర పూరకములయ్యే ఉంటూ, ఏకకాలములో పూర్ణత్వమును పొంది ధన్యములు కావలసి యున్నవి.

అప్రమత్తత యొక్క కర్తవ్యదక్షతకు తపస్సు ఒకటే చాలకము, పోషకము మరియు మార్గదర్శకము, జ్ఞానప్రదాయకము,కృపా దాయకము, ఇది మాయ, అనగా దైవపు వ్యవస్థ తపస్సు లేనీ కర్తవ్య ప్రజ్ఞగానీ, కర్తవ్య దక్షతగానీ అసాధ్యము. కావున కర్తవ్యపు పిలుపుకు బదులు పలుకుటకు కోరు ప్రతి మానవుడు తపస్సును ఆచరించియే తీరవలయును. తపస్సునందు సర్వము జాగృతమై వుంటుంది. కావునమనము శాంతిముగా పర్యాలోచించి ఆవశ్యక కర్త్యవమును చేయ మొదలు పెట్టవలయును. తపస్సుఅతి సూక్ష్మమైన కర్తవ్యము. దేహధారణము స్థూలపు కర్తవ్యము. జీవితమంటే స్థూల సూక్ష్మ కర్తవ్యముల సంగమము.

తపస్సు ధ్యానముచేత సాగవలసియున్నది. ధ్యానమునందు అన్నింటి మిలినము కావలయును. అట్లగుటకు షుమారు మూడు గంటల వ్యవధి అవరము. ధ్యానమనగా అప్రమత్తత యొక్క గమనిక. అది క్రమేణ సాధ్యమగు స్థితియైన కారణముచే, అక్కడ తొందరపాటు పనికిరాదు. చాపల్యమునకు లోనైన మనస్సు తొందరగా లేచుటకు తహతహలాడుతుంది. అట్లు కానివ్వక, ధృడత్వమును తెచ్చుకొని, ఇది ఆఖరు ధ్యానమేమో అను భావనలో కూర్చొనుటను పొడిగిస్తూ పోవలయును.

కర్తవ్యమును కూడా అలాగే చేయవలసియున్నది. చేయవలసి యున్న కర్తవ్యమునకు క్షణికత్వము అనునది లేదు.

అంతయూ శాశ్వతమునకే, శాశ్వతుని సేవకొఱకే అను ముందుజాగ్రత్తతో, ఆశ, పాశ, మోసములకు లోనుకాకుండా కర్తవ్యమునకు పూనుకొన వలయును.

## 64. సంసార బాధ్యత బలీయముగా నున్న తరువాత శాంతి ముఖ్యము

## 65. మీరు మీ ధర్మపత్ని మరియు పుత్రిక కొరకు, ధర్మము వైపు లక్ష్యము నుంచండి

## 66. అందని చెట్టుకు మొద్దు లావు

## 67. వారి వారి తెలివితేటల స్థాయి వారికే ఉండనీ. నాకు అక్కరలేదు. మీకు కావాలి అన్నంతవరకు ఉంచుకొనండి. చాలినప్పుడు మీరే దించుకొంటారు.

## 68. సాహసులు లేరు

మనము జీవులము మాత్రమే. ఆత్మలుకాదు. మనము మనుష్య ప్రాణులము. పురుషులము కాదు. దీని అర్థమేమిటి?

మనలో జీవమున్నది. కావున మనము జీవులము. జీవమంటే ఏమిటి? ఇంద్రియబద్ధమైన దేహమనే యంత్రములో మనస్-ఇంద్రియమను క్రింది మట్టపు మనేంద్రియముతో గుటుగుటుమంటున్న ప్రాణము. అక్కడ మరి ఏమియూలేదు. ఏది ఉండవలసి యుండినది? అంటే, మనస్సు, బుద్ధి,ఆత్మ మొదలయినవి. అవి అక్కడ లేవు కావున మనము కేవలము జీవులము మనము మనుష్య ప్రాణులము. ఎందుకంటే ప్రాణుల జీవనక్రమమునకు, మనకు ఏమీ తేడాలేదు. ప్రాణులు జీవించుచున్నవి, తినుచున్నవి, ప్రసవించుచున్నవి, చనిపోవుచున్నవి. మనముచేసేది కూడా అంతే కదా !ఇలా అయినందున, మనుష్య ప్రాణులము.

అయితే మనము ప్రాణులుగానే ఉండవలయునా? అంటే అలా ఏమికాదు. జీవిత్వమును, ప్రాణిత్వమును ప్రయత్న పూర్వకముగా పోగొట్టుకొని, ఆత్మత్వము మరియు పురుషత్వమును పొందుట సాధ్యమే. దానికుండే సూత్రమును కర్తవ్యము మరియు తపస్సని వెనుక చెప్పుకున్నాము.

జీవుల జీవనమును సంసారము అని పిలుచుటయైనది. ఈనాడు సంసార బాధ్యత మనకు బలీయమైనది. "జపమును చేస్తున్నారా?'' అని మన యోగసాధకులను విచారించితే మనకు వచ్చు సామాన్య ఉత్తరమేదంటే " సాధ్యము కాలేదుస్వామీ, సంసార తాపత్రయము!'' అవును, మనకు సంసారము చాలా పెద్ద భారమయినది. భారమును క్రిందికి దించుకొనండి అంటారు ప్రభువులు. కానీ అది మనకు సాధ్యము కాలేదు. "మీకు కావాలి అన్నంతవరకు అంటుకొని ఉండండి, చాలినప్పుడు మీరే దించుకుంటారు'' అంటారు ప్రభువులు. దీనిని ఉపనిషత్తు 'ప్రవృత్తి మార్గము' మరియు 'నివృత్తి మార్గము' అని పిలిచినది. సంసారము ప్రవృత్తి మార్గము. తపస్సు నివృత్తి మార్గము. ఒక మార్గమునుండి మరొక దానికి వచ్చుట

కష్టసాధ్యమయినను, రావలసియే ఉన్నది గనుక, ఇచ్చట శాంతిముఖ్యము.

పతికి ఒక ధర్మపత్ని ఉంటుంది. ఆత్మకు ప్రాణమే పత్ని. ప్రాణము సర్వదా ఆత్మ మిలనమునకై తహతహలాడుతుంటుంది. ఆ రెంటి సంగమమువలన ఆనందమను పుత్రిక పుట్టుతుంది దైవము చేత నియమింపబడిన పత్ని అయినందున ఆమె మన ధర్మపత్ని అయి, స్వరూపారంభపు సంగమునందు కనుబడిన ఆనందమను పుత్రిక కొరకై మనము వాటితో కుటుంబ జీవనమును సాగించవలసి యున్నది. ఆత్మ తండ్రియైతే, ప్రాణము భార్య, అగ్ని పుత్రుడు, ఆనందము పుత్రిక. అగ్నికి సాహససుత అను నామధేయమున్నది. ఎవడు ప్రాణవాయువు యొక్క గతాగతి సాహసమందు ఉద్భవించుననో, వాడే అగ్ని, అతడు పుత్రుడు. పుత్రికయందు మాధుర్యము, మోహకత, సుకుమారత ఉన్నది. పుత్రుని యందు ధైర్యము, సాహసము, బలము ఇత్యాది శక్తులున్నవి. ఇక మిగిలిన కుటుంబ వ్యక్తులలో కొంతమంది ఎవరంటే, మనస్సు సోదరుడు, బుద్ధి గురువు, వాయువు సేవకుడు. ఇలా ఉంది మన వసుధైక కుటుంబము!

ఈ రీతి సంసార నిర్వహణము స్వాగతార్హమే కదా ! అయితే దానికి సాహసము, ధైర్యము, సహనము కావలయునంతే! సాహసులు లేరు! అనునది ప్రభువుల విచారము.

అందని చెట్టుకు మొద్దు లావు, అన్నట్లుగా మానవత యొక్క భవ్యపూర్ణతకు ఇంద్రియ జీవనము అసాధ్యము. దానికి నిరీంద్రియపు నిచ్చెనయే కావలయును.

**69.** ఇక్కడ నానుండి తెలియవలెననెడి కోరిక యున్నవారికి తత్త్వము మరియు విద్య చూపుటకు సదా సిద్ధము. ఇది నా లోకకళ్యాణము కొరకు నేను తెలుసుకొన్న విద్యను దానము చేయుచున్నాను. ఇది పురాతన పద్ధతి కూడ

**70.** ఇతరుల మాటలలో చిక్కుకొని మాయాపాశమునందు చిక్కుకొనవద్దండి. ధర్మకర్మములకు అంటుకొని సాగుచునే ఉండండి. యౌవనమందు మానవుడి జీవితము గురితప్పితే, ముందు కష్టమున్నది. ఆలోచించిశాంతితో సాగండి. శాంతి

**71.** మాయాపాశమునందు పడకండి. ఇది నా ఆత్మవంచనము అని తెలుసుకొనండి.

**72.** హే! విధి. లోకము నా మాట నమ్మదు. ఏమి చేసేది? నన్ను నమ్మినవారికి తగిన దారి చూపుదమంటే ఈ రీతి మాయ చేతులలో పనికిరాని, సహవాసముచేస్తుంటే నేను ఏమి చేసేది. భక్తులకు వారి ప్రయాణములో సుఖము దొరకనీ అని కల్పించుటకు ఆస్పదమే దొరక నప్పుడు నా కెంత వ్యథ కలిగి ఉండాలి.దీనిని చెప్పుకొనటానికి స్థలములేదు కదా, అన్నట్లు అయినది

**73.** అదేమి బంధనమో, వీరి పిచ్చాపాటి వినటానికి మేము పిలిచితిమా ! వచ్చిన తరువాత తెలుసుకొనవలసినది ఉంటే తెలుసుకోవాలి! లేదంటే పోవాలి. సంతపురాణము ఎవరికి కావాలి? ధర్మము ఎక్కడికి వచ్చినదో చూడండి

**74.** మాయా జగత్తు! విధిలేదు, నాఏడ్పును వినేవారెవరు? వారు వారు ఆలోచించినదే నిజమని నడుస్తూ ఉంటారు. అయితే అది అలా కాదు

మానవత ఈ మధ్య ఐదువేల సంవత్సరముల ఇతిహాసములో ఒక కఠిన తపస్విని కాని, సృష్టి నడవడికను తెలుసుకున్న ఒక ఋషిని కాని, ప్రతిసృష్టిని చేసే సిద్ధిగల ఒక సిద్ధునికాని చూడలేదు. దీనివలన మన సమాజములో

ఆధ్యాత్మ యోగవిద్య యొక్క సంప్రదాయము లేనట్లై మనము సంస్కారముచేత, అభ్యాసముచేత, అనుభవముచేత బీదవారమైనాము. వెనుకటి మహానుభావులు, దైహికశక్తి, మానసిక బుద్ధిస్థాయి హెచ్చుగా ఉన్న కాలములో జీవించిననూ వారు తమ అల్పతను పోగొట్టుకొని, మహత్తువైపుకు సాగే తీరవలయునన్న ధృడత్వముతో సాగునట్టి ధీరులై ఉండిరి. ఐతే మనమీనాడు, పోయినదిపోగా మిగిలిన మహత్తును కూడా పోగొట్టుకొని, అల్పులము గానే మిగిలిపోతిమి. ఇది ఎంత శోచనీయమైన విషయము!

మనుష్య జీవనము, ఇప్పుడు మనము ప్రతిచోటా చూస్తున్నట్లు, ఇంత తుచ్ఛమా! జీవితమంటే, ఎలాగో పెరిగి, ఎలాగో చావటమా? ఛీ! ఇది ఇంతే! జీవనమైతే, వెనుకటి చరిత్రంతా అబద్ధమే అయి ఉండాలి.

ఐతే క్షణకాలపు వివేకముచేత, ఇది అలాలేదు, మనుష్య జన్మము అంతక్షుద్రముకాదు, అది అతిభవ్యముగా రూపుదిద్దబడినది, తెలియకనే మనమానాడు గతిలేనివాళ్ళమయినాము, తెలుసుకొంటే ఎంతెంత సుఖముంటుందో - అన్న జ్ఞానము కలిగే తీరాలి.

ప్రభుశ్రీ అచ్యుతులు మనకు కఠిన తపస్విగాను, ధర్మ, కర్మ ములకు అంటుకొని జీవించిన ఋషిగాను, మానవతయొక్క పూర్ణత్వమైన యోగిగాను, కనబడ్డారు. అయితే సంస్కారము, యోగాభ్యాసము, అనుభవములేని మనలో కొందరు, ప్రభువుల గురించిన మాటలు,కేవలము ఉత్ప్రేక్ష అని మనలను దూషించినను మనకు చింతలేదు. ఒక సామాన్య వ్యక్తిని అసామాన్యుడని ప్రచారము జేసినచో మనకు వచ్చు లాభమేమి? అయితే "సత్యమును దాచకుండ చెప్పండి" అని ప్రభువులు చెప్పినారు "చూచిన దానిని కొంచెము కాలము ఆపి ఉంచండి' అని కూడా వారి కఠినమైన ఆజ్ఞ కూడా ఉండినది. ఐతే ఈ మధ్య "దాచిపెట్టిన దానిని నీవు చెప్పవలసి ఉన్నది", "నేను చెప్పినంత మట్టుకు నీవు చెప్పుము" అని ఆజ్ఞయైన కారణమున ఈ సాహసము చేయవలసి వచ్చినది.

సత్యమునకు సత్యమే సాక్షి. ప్రచారముచేత ఎవరూ శాశ్వతముగా శ్రేష్ఠులై మిగిలిపోజాలరు. శ్రేష్ఠత శ్రేష్ఠతను మాత్రము పైకెత్తినిలుపుతుంది. శ్రేష్ఠుని సహవాస భాగ్యకారణముగానే మనలో అనేకులు శ్రేష్ఠత సొగసును ఆస్వాదించుచునే యున్నారు. శ్రేష్ఠుడు పరమ ప్రేమమూర్తిగానే ఉన్నందున ఆ మహానుభావుడు మనలను నిరంతరము కాపాడుచున్నాడు. క్షణకాలపు పిలుపునకు తక్షణము అభయహస్తము కనబడుచున్నది. ఇది మాఅనుభవ భాగ్యము.

ప్రభువుల జీవనక్రమము అతిసరళము, ధర్మ - కర్మములకు అంటుకొని ఉన్నది. వైజ్ఞానికము, తాత్త్వికము, శుద్ధము, ప్రేమ మయము, అత్యంత క్రమశిక్షణతో కూడినదియు అయి ఉండినది. వ్యక్త జీవనముకంటే వారి అవ్యక్త జీవనము బహుగొప్పది, అను దానిని వారి సన్నిధిలో జీవించిన అందరి ఆశ్చర్యాద్భుత అనుభవము. "నాలోక కళ్యాణమున కొరకై నేను తెలిసికొన్న తత్త్వమును చూపి, విద్యను దానము చేయుటకు నేను సదాసిద్ధము" అని చెప్పినారు ప్రభువులు. ఆవిద్య యు పురాతన పద్దతి అని చాటినారే కాని అది నా పద్ధతియని అని ఎక్కడను చెప్పుకోలేదు. అంతే కాదు. వారెప్పుడు "నాకు తెలుసును" అని ఒక్కమాటను కూడ చెప్పలేదు. అక్కడ వారియొక్క వ్రాతను ఇవ్వగోరుచున్నారు. అది యెంత సమగ్రముగా వారి వ్యక్తిత్వమును ప్రతిబింబించుచున్నది అనునది ఎవరికైనను స్పష్టము కాగలదు.

"ఓం శాంతి. ఓం కారమే నమస్కారము ఒకే ఒకమూలము మరియు నిజమంత్రమైన, ఆ ఓం నకు ఎల్లప్పుడు నా నమస్కారము. "ఓం" తెలియుటకు దిక్కుతోచక బాధపడుతున్న నాకు దారిచూపించి ఉపదేశించిన శివశంకరానంద త్వమునకు నా నమస్కారములు. పూర్తి విశ్వానికి మనుష్యత్వమును తెలిసికొనుట సవిస్తారముగా వర్ణించిన పురాణ

మూలతపోపదేశ పురుషులైన ఉపనిషత్కారులకు నా నమస్కారములు. మనుష్యత్వపు గుట్టు మరియు దానిలోసాగిపోవు విధానము వీటిని వేరు వేరు జేసి మన ఎదుట నుంచిన మహనీయులకు మేము చిర ఋణులము. దీనిని తెలిసికొను కోరికతో తపించు చున్న నా బంధువులకు నా వినయపూర్వక శాంతివచనములు.''

మనుష్యత్వమునకు మాయాపాశమును క్షుద్రబలముండి అది మోసముగా, మబ్బుగా, మోహముగా, మమతగా, ముదిమిగా, మృత్యువుగా, మోక్షముగా మనలనందరిని పీడించుచున్నది. దీని నుండి దాటుకొనుటకు మనుష్యప్రయత్నము ఒక్కటే చాలక, దైవకృపకూడాఅవసరమున్నదీ, మహర్షుల ప్రార్థనకు దైవపుకానుకగా లభించినారు, ప్రభువులు.

మనుష్య సమాజములో కేవలము శబ్దము, గలభా మాత్రమే ఉన్నది, అక్కడ సారము లేదు. దైవవాక్యమును అది నిరాకరిస్తూనే వచ్చినది. ప్రభువులు, "హే విధి! నా రోదనమును (ప్రాణపు ఓంకారనాదమును) వినువారే లేరు. నా మాటను (తత్వమును) నమ్మరు, నా మార్గమును త్రొక్కువారెవరు లేరు. ఎవరికి చెప్పుకొనేది'' - అని పరితపించుచున్నారు.

ఔను, వేలాది సంవత్సరముల  కలిమలములను కడుగుటకు ప్రభువులకే ఎన్నో సంవత్సరములే కావలసి వచ్చినది. అవతార పురుషుల ప్రయత్నము నిరోధించే శక్తి ఏది? దాని మూలమేది? దీని చర్చ ప్రస్తుతం ఇక్కడ లేదనే భావించెదను. ముందు రావచ్చును.

**75.** మీ కర్మమునకు ఎవరేమి చేయగలరు? అది అసాధ్యము కదా! మరల మరల వెనుతిరిగి ఆ విషయమును వ్యక్తి సహవాసములో పడినపుడంతా పడిన కష్టాలను ఆలోచించండి.

**76.** మీరు మోక్షానికి పోవునప్పుడు వారిని పిలుచుకొనే పోవచ్చును, లేదా వారు మిమ్ములను పిలుచుకొని పోవచ్చును అని అనిపిస్తుంది.

**77.** చేసిన వారికి చేసినంత ఉండియే తీరుతుంది.

**78.** సాధ్యమైనంత ప్రయత్నముతో పోయినదానిని అక్కడే వెదకుట మేలు

**79.** (మనము) రాలగొట్టి పండుగా చేయుట సహజముకాదు

**80.** వచ్చిన దానిని అనుభవించుటయే సార్థకము. వద్దు అంటే తప్పుతుందా ? అయినా తగిన చికిత్సలో ఉంటూ, దాని మూలకారణము నిర్మూలించండి.

**81.** బాల బుద్ధి వద్దు. జాగ్రత్త

మాయాపాశమువలె కర్మముకూడ బలీయమే. కర్మమంటే కలిమలము. దానిని, మనదానిని, మనమేకడుగుకొనవలెను. కర్మ లేపనము స్వంత వ్యవహారముచేతను, ఇతరుల సహవాసముచేతను వస్తుంది. వచ్చినదానిని అనుభవించకుండా ఉండడానికి సాధ్యంకాదు. ఆటలాడి  వళ్ళు మురికి చేసికొన్న తరువాత శుభ్రము చేసి కొనవలెను. అంటే తప్పుతుందా ? ఛ, అది ఎన్నటికి సాధ్యముకాదు. అయితే అక్కడ అంధానుకరణము కాని, మరియొకరిని అనుసరించు కొనుట పనికిరాదు. దోష నివారణకు తగిన చర్య అవసరము. రోగమునకు తగిన చికిత్స. అది ఎలా అంటే, ఆకలి అనే రోగానికి భోజనమనేది

మందు. ఇలాగే ప్రభువుల బోధ ఉన్నది.

అనేక సాధక మిత్రులు, తమ నిత్య జపముచేత తమకు ఎటువంటి ప్రగతి దొరకనే లేదు. అంటూ ఉంటారు. యోగమునందు దొరకు ప్రగతిని గమనించినచో కనుగొనవచ్చును. తపస్సుచేత మన వ్యక్తిత్వము వికసించుతూ పోతుంది. ఇక్కడ సంశయము వద్దు. ప్రభువుల అభయమేమనగా చేసినవారికి చేసినంత. ఇచ్చిన వారికి ఇచ్చినంత ఉండే ఉంటుంది. ఒక నిమిషపు జపమైనను, లోనున్న బ్యాంక్‌లో జమ అయి ఉంటుంది. అనుమానము వద్దు. ఈ సందర్భములో ఇప్పటి పరిస్థితిలో సాధకుల శక్తిని, అంటే పొందిన దానిని, ప్రభువులు తాళమువేసి ఉంచినారు. దాని ఉపయోగము మున్ముందు చాలా ఉన్నది.

అయినప్పటికి జపములో సహజత ఉండాలి. ఇచ్చట ఒత్తిడి, హఠము, ఆతురత, అనుకరణము సర్వదా పనికిరాదు. జపము సహజముగా పెరిగి వికసించవలయును. రాలగొట్టి పండుగా చేస్తే దాని రుచిలో వ్యత్యాసము వస్తుంది.

కావున సాధకులు అధైర్యపడకుండా విశ్వాసముతో ముందుకు నడచుదురుగాక ! జపము యొక్క క్రమము కష్టమైన సందర్భములో జపముచేతనే దానిని సరిచేసుకొనండి. జపమంటే అది ఆకలికి మందు, అజీర్ణానికి మందు.

బాల బుద్ధి అనగా కోతి చేష్టలు, అనగా చంచల జీవనము వద్దు.

**82.** దొరికిన పుస్తకాలన్ని చదివిన మనస్సునిండా వ్యాధి

**83.** కుక్క చన్నులలో పుట్టెడు పాలు ఉండవచ్చు కాని ఏమి ప్రయోజనము?

సత్యము పుస్తకములో లేదు, మస్తకములో నుంది. పుస్తకము హస్తానికి భూషణమయితే, మస్తకము ఆత్మకు భూషణము. పుస్తకమందు బంగారమున్నది, రత్నములున్నవి, దేవుడూ ఉన్నాడు. దయ్యము ఉన్నది. అయిదే దాని వలన ఎవరికేమి ప్రయోజనము. పుస్తకపు పని అల్పము. ఓడిన మనస్సులో ఉత్సాహమును నింపుట మాత్రమే వాటి కర్తవ్యము. అంతే కాక అనేక లోకోపయోగ విషయ సంగ్రహణమునకు అవి కావలయును.

వేదోపనిషత్తులంటే పుస్తకములు కాదు. అది తత్త్వము. తత్త్వాభ్యాసులకు దారి దీపము. అవి ప్రయోగశాలయందు, చేసిన ప్రయత్నముల తాత్పర్యము ! అక్కడ ఉండేది సాంకేతిక భాష, ప్రౌఢభాష, సుసంస్కృత భాష.

**84.** వైద్యులు జాస్తి అయితే వ్యాధి ప్రబలమౌతుంది. చట్టములు జాస్తి అయితే కలహములు ప్రాప్తిస్తవి. శస్త్రములు అధికమైతే సమరము ఘోరమౌతుంది (ఇది స్వప్రకాశమైనందున, వివరమువద్దు)

**85.**ఇక్కడికి నా చివరి బోధ

చెప్పవలసినదంతయు, చెప్పడం అయినందున తత్త్వబోధ ముగిసినది. ప్రభువుల మాటలు ఎన్ని ఉన్నాయో తెలియదు. వాటిలో స్వల్పాంశము మాత్రమే వెలువడినది. అది వారి కృపచే మాత్రమే సాధ్యమయ్యేటటువంటిది. ప్రభువు తత్త్వమునకే ప్రభువు. అతడు దానము చేసినంత మనకు దత్తమౌతుంది. మన గొప్ప ఏమున్నది!

నా ప్రభువుకు నా సర్వమును నివేదించుకొని, అర్పించు కొనినందున, నేనంటే అతడు అనుగ్రహించినంత, మరియు కరుణించినంత.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# పరిశిష్టములు

మొదటి పరిశిష్టము :

మాయ అంటే యేమిటి?

చాలకము, పోషకము, మార్గదర్శకము, జ్ఞానప్రదాయకము

కృపాదాయకము.

రెండవ పరిశిష్టము :

మనుష్య జీవితమునకున్న నాలుగు ఆలంబనములు,

(పదవ సూత్రము చూడండి)

| ఆలంబనములు | ఆలంబనములకున్న అవలంబనము | ఆలంబనములను దొరికించుకొనురీతి |
|---|---|---|
| 1. ప్రాణము | అశనము | ప్రాణముయొక్క మథనము |
| 2. మనస్సు | అమృతపానపు అనందము | ప్రాణ మనోమిలనము తరు వాత వానినుండి లభించును |
| 3. ఆత్మ | శాంతి | మేలుకొన్న ఆత్మ తనలో తానే క్రీడించుటయేగాక దైవపు సంబంధమును పొందినపుడు దొరికే పరమస్థితి |
| 4. దైవము | మాయ | జ్ఞానోత్తరకర్తవ్యమునందు దొరకు దైవపు వ్యవస్థ |

మూడవ పరిశిష్టము :

ప్రాణపు మూడు పాదములు

(24 నుండి పుట వరకు)

| ప్రథమ పాదము | ద్వితీయ పాదము | తృతీయ పాదము |
|---|---|---|
| కంఠప్రదేశము<br>నుండి<br>నాభివరకు | నాభినుండి<br>మెడుల్లా<br>వరకు | మెడుల్లా పైనున్న<br>బ్రహ్మరంధ్రము |

నాల్గవ పరిశిష్టము :

యోగసాధనయొక్క మూడు స్థానములు
(36 నుండి పుట వరకు)

| గురుస్థానము | గుప్తస్థానము | గమ్య స్థానము |
|---|---|---|
| కంఠప్రదేశము | మూత్రకోశము నుండి<br>వెన్నుపూస కొనవరకు<br>ఉండు ప్రదేశము | బ్రహ్మ రంధ్రము |
| భూః | భువః | స్వః |
| భూమి | ఆకాశము | అంతరిక్షము |

ఐదవ పరిశిష్టము :

మనస్సు మరియు సంకల్పముయొక్క వేరువేరు
అంతస్థుల లేక పొరలు

| మనస్సు | సంకల్పము |
|---|---|
| 1. మన ఇంద్రియము | ఆశ, కోరిక, వాంఛ |
| 2. మనస్సు | అహంకారము, హఠము<br>(సాత్వికము) (రజస్తమోపేతము) |
| 3. మనాః | బుద్ధియొక్క విచికిత్సకత (విచికిత్సికత) |
| 4. మానసం<br>(ఆత్మ) | జ్ఞానము, ప్రజ్ఞ<br>కర్తవ్యదక్షత, ప్రేమ, శాంతి |

ఆరవ పరిశిష్టము :

జగత్సంసారము (జగత్ - సంసారము)

| | | |
|---|---|---|
| ఆత్మ | ——— | తండ్రి |
| ప్రాణము | ——— | తల్లి |
| ఆనందము | ——— | కుమార్తె |
| అగ్ని | ——— | పుత్రుడు |
| బుద్ధి | ——— | గురువు |
| మనస్సు | ——— | మిత్రము (స్నేహితుడు) |
| ఇంద్రియములు | ——— | సేవకులు, పిల్లలు |

ఏడవ పరిశిష్టము :

ఓంకారము యొక్క మూడు మాత్రలు

| అ | ఉ | మ |
|---|---|---|
| దీర్ఘగతి | మధ్యగతి | శాంతిగతి |
| రుద్రగతి | విష్ణుగతి | బ్రహ్మగతి |
| ఋగ్ | యజుస్ | సామ |
| ఆది | మధ్య | అంత్యము |
| తమస్సు | రజస్సు | సాత్వికము |

ఎనిమిదవ పరిశిష్టము :

పంచీకరణము
(35వ సూత్రము చూడండి)

| | |
|---|---|
| ప్రాణము | ప్రాణం శరణం గచ్ఛామి |
| మనస్సు | మానసం శరణం గచ్ఛామి |
| బుద్ధి | బుద్ధిం శరణం గచ్ఛామి |
| ఆత్మా | ఆత్మానాం శరణం గచ్ఛామి |
| దైవం | దైవం శరణం గచ్ఛామి |
| | పంచీకరణమునకున్న సూత్రము |
| యోగము | యోగం శరణం గచ్ఛామి |

# మానవీయ సంపద మరియు దాని వ్యవస్థ

**తొమ్మిదవ పరిష్టము:**

- దైవము - ప్రకృతి
  - జడవర్గము
  - చేతనావర్గము
    - ప్రాణివర్గము
    - మనుష్యవర్గము
      - ఇంద్రియ సంపద (ఆసురీ సంపద)
        - ఐదు బ్రహ్మేంద్రియములు (జ్ఞానేంద్రియములు, బుద్ధీంద్రియములు)
          - శ్రోత్రము (చెవి)
          - చక్షువు (కన్ను)
          - త్వక్కు (చర్మము)
          - జిహ్వ (నాలుక)
          - నాసిక (ముక్కు)
        - ఐదు కర్మేంద్రియములు
          - పాయువు (గుదము)
          - ఉపస్థ (జననేంద్రియము)
          - హస్తములు (చేతులు)
          - పాదములు (కాళ్ళు)
          - వాక్కు (మాట)
        - మన- ఇంద్రియము
      - నిరేంద్రియ సంపద (దైవీ సంపద)
        - వాయువు
        - ప్రాణము
        - మనస్సు
        - అహంకారము
        - బుద్ధి
        - ఆత్మ
    - సస్యవర్గము

Presented by:

D. Udaya bhaskar

G. Arun kumaar

పదియవ పరిశిష్టము :

# జీవాత్మ

ఇంద్రియముల సమూహము, వాటిని ఆడించు మన - ఇంద్రియము, వాయువును ఆధారము చేసికొనియుండు ప్రాణము - వీటియొక్క సమూహమే జీవము. మనస్సు, ఆహంకారము, చిత్తము, బుద్ధుల ప్రకాశముచేత వెలుగుచున్న శక్తియే ఆత్మ, ఈజీవము మరియు ఆత్మల సంయోగమే యోగము అని ప్రభువుల నిర్ణయము.

పదకొండవ పరిశిష్టము :

జీవ - ఆత్మల గురించి

| జీవము | ఆత్మ |
|---|---|
| ప్రేయస్సు | శ్రేయస్సు |
| ప్రవృత్తి మార్గము | నివృత్తి మార్గము |
| ఇంద్రియ జీవనము | నిరీంద్రియ జీవనము |
| అధోగతి | ఊర్ధ్వగతి |
| విపత్తు | సంపత్తు |
| ఆసురీ రాజ్యము | దైవీసామ్రాజ్యము |
| అసత్తు | సత్తు |
| మృత్యు మార్గము | అమృత మార్గము |